E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: TELANGANA    సంపుటి : 01    సంచిక : 117 శనివారం, ఏప్రిల్ 04, 2026    ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్    పేజీలు: 08    వెల :05/-

## ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్



**వారు ఇక్కడ నాలుగేసి పెళ్లిళ్లు చేసుకోకుండా అడ్డుకట్ట**

**అసోం ఎన్నికల ప్రచారంలో అమిత్ షా**

**గువాహటి, ఏప్రిల్ 3 :** చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి తో అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. అస్సాంలోని గోల్‌పాడాలో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడుతూ, తిరిగి తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గిరిజనాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అస్సాం ముఖ్యమంత్రి హిమంత మిగతా2లో...

## గ్రూప్-1 ఆశావహులకు ఊరట

**● సుప్రీం తీర్పును స్వాగతించిన సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, ఏప్రిల్ 3 :** తెలంగాణ గ్రూప్-1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల తమ ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నానని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొలువుల కోసం ఏండ్లకు ఏండ్లు కండ్లు కాయలు కాచేలా ఎదురుచూసి, మిగతా2లో...

## ఎపిలో ఒక్కసారిగా మారిన వాతావరణం

**పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం**

**ఈదురుగాలులు కూడా ఉంటాయని హెచ్చరిక**



**అమరావతి, ఏప్రిల్ 3 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అత్యవసర హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, మిగతా2లో...

## టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ అగ్రగామి

**● ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సహిస్తాం ● చేనేత, ముత్యాలకు పెట్టింది పేరు తెలంగాణ**

**● ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్**



**హైదరాబాద్, ఏప్రిల్ 3 :** తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణెళి మా తొలి ప్రాధాన్యం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన టెక్స్‌టైల్ రంగ ప్రముఖులకు స్వాగతం పలుకుతూ, తెలంగాణను ప్రపంచ వస్త్ర రంగ పటంలో అగ్రస్థానంలో మిగతా2లో...



## కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్త

**- కార్బైడ్ మామిడి పల్లను గుర్తించండి: సజ్జన్నార్**

**హైదరాబాద్, ఏప్రిల్ 3 :** మామిడిపండ్ల సీజన్ ప్రారంభం అయ్యింది. నగరంలో నోరూరించే పళ్లు కనిపిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు వ్యక్తులు కల్తీ మామిడి విక్రయాలకు పాల్పడటం ఆందోళనకు గురిచేసే విషయం. మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్ రసాయనాలతో మిగతా2లో...

## రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

**● సభలో మాట్లాడే అవకాశం ఇవ్వరాదని లేఖ ● ఆప్ తీరుపై మండిపడ్డ రాఘవ్ చద్దా ● ప్రజా సమస్యలపై గొంతెత్తితే తట్టుకోలేరా? ● వీడియో విడుదల చేసిన రాఘవ్ చద్దా**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 :** రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చద్దాను ఆ పదవి నుంచి ఆప్ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా తాజాగా స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో మిగతా2లో...



## భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం

**అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' జలప్రవేశం**

**విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**

**విశాఖపట్నం, ఏప్రిల్ 3 :** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో మిగతా2లో...

## స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

**- ఆనాడు మాట్లాడినా రేవంత్ ఇప్పుడు మాట్లాడడం లేదు**

**- టిఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది..ఎవరైనా వాడుకోవచ్చు**

**- జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్,ఏప్రిల్ 3 :** రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లా డుతూ.. రాష్ట్రంలో 39,640 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సీబీఎస్సీ సెంట్రల్ సిలబస్ ఉన్న స్కూల్స్‌లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటినుంచే మిగతా2లో...

## గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

**- తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాం**

**ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం: బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు**



**నారాయణపేట,ఏప్రిల్ 3 :** గిరిజనులకు ఉన్న 6 శాతం రిజర్వేషన్‌ని 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనతా ఆయనకే దక్కుతుందన్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం బావోజీ జాతరకు మాజీ మంత్రులు హరీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..'లోక్ మసంద్ మహారాజ్ జాతరకు రావడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతానికి రూ.8 కోట్లతో బ్రిడ్జి వేయించింది మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి. ఈ దేవాలయ అభివృద్ధికి, గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో చేశారు. మా తండాలో మిగతా2లో...

## రెండో విడత రైతుభరోసాకు రంగం సిద్ధం

**పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్లు అవసరం**

**నిధులు సమకూర్చాలని సిఎం రేవంత్ ఆదేశం**



**హైదరాబాద్, ఏప్రిల్ 3 :** తెలంగాణలోని సాగునీటి అవసరాలు, పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్ పెట్టుబడి సాయం కింద అందించే 'రైతు భరోసా' రెండో విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఒత్తిడిలో ఉన్నప్పటికీ, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ అడుగు వేస్తోంది. రెండో విడత పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్ల భారీ మొత్తాన్ని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, రుణాల చెల్లింపులు పూర్తయిన వెంటనే.. మిగతా2లో...

# ఎపిలో ఒక్కసారిగా మారిన వాతావరణం

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉండనుందని, ఆయా జిల్లాల యంత్రాంగం ఇప్పటికే అప్రమత్తమైంది.వర్షంతో పాటు గంటకు 40 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండవద్దని సూచించారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, పొలాల్లో పనిచేసే రైతులు, పశువుల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రావొద్దని, ప్రయాణాలను వాయిదా వేసుకోవడం ఉత్తమమని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు స్థానిక అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరో వైపు తెలంగాణలోనూ రానున్న 3 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడే అవకాశముంది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

గానీ.. తనను ఓడించలేరంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా.. ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా అని నిలదీశారు. నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే.. అది ఆమ్‌ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా అని అన్నారు. మొన్నటికి మొన్న వివిధ రకాల పన్నులుపై నిలదీశారు. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా అని రాఘవ్ చద్దా తన వీడియోలో పేర్కొన్నారు. రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా రాఘవ్ చద్దాను తొలగించిన ఆప్.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఆప్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు చద్దా దూరంగా ఉంటుండటం, పార్టీ కార్యక్రమాలపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాఘవ్ చద్దా భాజపాలో చేరనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశ మైంది.ఎంపి రాఘవ చద్దాని ఉపనాయకుడి పదవి నుంచి తొలగించాలని గురువారం రాజ్యసభ సచివాలయానికి ఆ పార్టీ లేఖ రాసింది. సభలో రాఘవ చద్దాని మాట్లాడనివ్వకూడదని కూడా ఆ లేఖలో ఆప్ పేర్కొంది. దీనిపై ఆప్ ఎంపి రాఘవ్‌చద్దా శుక్రవారం స్పందించారు. పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తడం నేరమా? నేను ఏదైనా తప్పు చేశానా? అని ఆప్‌ని ప్రశ్నించారు. ఈ మేరకు ఓ వీడియోను ఆయన శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. నాకు ప్రజల మద్దతు ఉంది. నా మౌనాన్ని నా ఓటమిగా పొరపాటు పడకండి అని రాఘవ్ చద్దా వీడియోలో తెలిపారు.

# భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ (ఎనిటతిజీని ఔజీలా) వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత. ఐఎన్‌ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు. 149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్‌ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశ్శబ్ద ఫిరంగులతో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్-8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది. అరిదమన్ అనేది ఒక పదం కాదని.. ఒక శక్తి అని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. భారత్ మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ అరిదమన్ అని తెలిపారు. దీంతో సముద్ర ఆధారిత అణు నిరోధకశక్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పని చేస్తున్న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెబోరేటరీ (ఎన్‌ఎస్‌టీఎల్)ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అందులోని కావిటేషన్ టన్నెల్‌కు సైతం ఆయన శంకుస్థాపన చేశారు. 2016లో ఐఎన్‌ఎస్ అరిహంత్, 2024 ఆగస్టులో ఐఎన్‌ఎస్ అరిఘాట్‌ల సరసన తాజాగా ఐఎన్‌ఎస్ అరిదమన్ చేరింది. అరిదమన్ చేరికతో.. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మించి, నిర్వహిస్తున్న అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి ఎంపిక చేసిన దేశాల క్లబ్‌లో భారత్ చేరింది. ఈ జలాంతర్గాములు శత్రువుల కంటపడకుండా నెలల తరబడి సముద్రగర్భంలో ఉంటాయి. శత్రు దేశాల నుంచి అణు దాడి జరిగితే.. సముద్రం లోపలి నుంచే దీటుగా ఇవి బదులిస్తాయి.

# టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ అగ్రగామి

(మొదటి పేజీ తరువాయి)

నిలిపేందుకు ప్రభుత్వ దార్శనికతను పంచుకున్నారు.తెలంగాణకు వస్త్ర రంగంతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని గుర్తుచేశారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర ఉంది. తెలంగాణ గర్వంగా చెబుతోంది.. టెక్స్‌టైల్ మన డీఎన్‌ఎలోనే ఉంది. నిజాం కాలంలోనే ప్రపంచ నలుమూలల నుండి వ్యాపారులు హైదరాబాద్ కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారు అని ఆయన పేర్కొన్నారు. కేవలం పరిశ్రమగానే కాకుండా, ఇది లక్షలాది మందికి జీవనాధారమని.. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్ వంటివి మన సంస్కృతికి ప్రతీకలని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047’ గురించి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వివరిస్తూ, ‘తెలంగాణ రైజింగ్ 2047‘ విజన్‌ను సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యం అని పేర్కొన్నారు. ఇంకా 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా మార్చడమే మా సంకల్పం అని అన్నారు. అలాగే వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, పత్తి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారులకు ఆయన పిలుపునిస్తూ.. ‘మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం. డీప్ టెక్, ఫార్మా, ఏరోస్పేస్ వంటి రంగాల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న తెలంగాణ, ఇప్పుడు టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్ ను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. మరోవైపు హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలను ప్రారంభించడాన్ని ఆయన ప్రస్తావించారు. టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాక హాలీవుడ్ కూడా హైదరాబాద్ ను కేంద్రంగా చేసుకుంటున్న తరుణంలో సినిమా రంగానికి అవసరమైన ఫ్యాషన్ ను కూడా తెలంగాణ నుంచే అందించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు.

# కేరళంలో రేవంత్ అబద్ధాల ప్రచారం

- ఆరు గ్యారెంటీలపై అబద్ధాలతో మోసం
- కెసిఆర్ లాగే అబద్ధాల ప్రచారం అందుకున్న రేవంత్
- తెలంగాణలో అమలు చేయని పథకాలను ప్రచారం చేస్తారా..?
- ఇది క్షమించరాని మహాపరాధం...ప్రజలను మోసం చేసే యత్నం
- సిఎం రేవంత్ ప్రచారంపై మండిపడ్డ కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 3 : కేరళంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్దాల ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించారని, ఇది తెలంగాణ ప్రజలను మోసం చేయడమేనని రేవంత్ పర్యటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు తెలంగాణలో పూర్తిగా విఫలమయ్యాయని.. ఒక్క పథకం కూడా సమర్థవంతంగా అమలు కాలేదన్నారు. అమలు చేయని పథకాలను అమలు చేసినట్టు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డివి మోసం చేసే రాజకీయాలు. గతంలో కేసీఆర్ ఎలా హామీలు ఇచ్చి అమలు చేయలేదో, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే మార్గంలో నడుస్తున్నారు. అమలు చేయకపోయినా ’చేశామని అనుకోండి’ అనే ధోరణి ప్రమాదకరం అని హెచ్చరించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పారు, ఇచ్చారా?. పెన్షన్లు రూ.2,000 నుంచి రూ.4,000 చేస్తామని, దివ్యాంగులకు రూ.3,000 నుంచి రూ.6,000 చేస్తామని చెప్పారు, అమలు చేశారా?. దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు.. ఇచ్చారా?. బీసీలకు రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పారు.. రెండు సంవత్సరాల పాలనలో ఒక్క ఏడాది కూడా రూ.20 వేల కోట్లు ఇవ్వలేకపోయారు. ఇవన్నీ కేరళ ప్రజలకు చెప్పగలరా?. తెలంగాణలో పెళ్లయిన ఆడబిడ్డలకు తులం బంగారం ఎక్కడ?. ఉచిత ఎలక్ట్రిక్ స్కూటర్లు ఎక్కడ?. నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?. నిరుద్యోగ భృతి ఎక్కడ?. ఈ హామీలన్నీ



ఎక్కడికి పోయాయి?. ఇవన్నీ చేయకపోయినా.. గ్యారెంటీలు అమలు చేశామని కేరళంలో రేవంత్ రెడ్డి చెప్పడం ఎంత పెద్ద మోసమో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ మాటలను నమ్మకండి. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలు కేరళం ప్రజలను మోసం చేశాయి. గత 10 సంవత్సరాలుగా అభివృద్ధిని అడ్డుకున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ వస్తే అవినీతి మరింత పెరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి మాటలకు కేరళంలో విలువ లేదు. ఆయన ఎందుకు అక్కడికి వెళ్లారో అందరికీ తెలుసు. తెలంగాణ నుంచి డబ్బులు పంపుతున్నారనే అనుమానాలు ప్రజల నుంచి వస్తున్నాయి. అందుకే ఆ పార్టీ నాయకులను అక్కడికి పిలుస్తున్నారు. ఉపన్యాసాలు ఇవ్వమని పిలుస్తున్నారు

# ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

బిశ్వశర్మ సమగ్ర మ్యాప్ సిద్ధం చేశారని అమిత్‌షా తెలిపారు. దీనిని ముందుకు తీసుకువెళ్లి, సమర్థవంతంగా అమలు చేయాలంటే బీజేపీకే ప్రజలు ఓటు వేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో తొలిసారి గిరిజన మహిళ దేశ అధ్యక్షురాలు అయిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఆదివాసీ మహిళలను రాష్ట్రపతి చేయలేదని, మోదీ వచ్చాక పరిస్థితి మారిందని, ద్రౌపది ముర్ము దేశానికి తొలి పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. యూసీసీ నుంచి ఆదివాసీ ప్రాంతాలను మినహాయిస్తామని చెప్పారు. పొరుగున్న ఉన్న మేఘాలయాలో చొరబాటుదారులు ఇటీవల గరో హిల్స్ అటానమస్ జిల్లా కౌన్సిల్‌లో గిరిజన మహిళలను పెళ్లాడి రాజకీయ పలుకుబడిని సంపాదించే ప్రయత్నం చేశారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని అమిత్‌షా చెప్పారు. అస్సాంలో తమకు మరో ఐదేళ్లు అధికారం ఇస్తే యూజీసీని అమలు చేయడంతో పాటు చొరబాటుదారుల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అస్సాంలో శాంతిని బీజేపీ పునరుద్ధరించిందని, కాంగ్రెస్ తిరిగి వచ్చినా, కొన్ని సీట్లలో నెగ్గినా కూడా తిరిగి రాష్ట్రంలో అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# గ్రూప్-1 ఆశావహులకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేండ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్–1 ఆశావహులకు ఇది పెద్ద ఊరట అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం వచ్చీరావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసిందని గుర్తు చేశారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దృష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్నిర్మాణంలో తొలి గ్రూప్–1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామని తెలిపారు. వారికి మరోసారి అభినందనలు ప్రకటించారు. ప్రభుత్వ ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ చైర్మెన్, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# రెండో విడత రైతుభరోసాకు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిధులను సేకరించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. మొత్తం రూ. 9,000 కోట్ల అవసరం ఉన్న ఈ పథకాన్ని, నిధుల లభ్యతను బట్టి ప్రభుత్వం మూడు విడతల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఎకరం లోపు ఉన్న రైతులకు మొదటి విడత నిధులు అందగా, ఇప్పుడు ఒకటి నుంచి ఐదు ఎకరాల వరకు సాగు భూమి ఉన్న రైతులకు ఈ నెల రెండో వారంలో నగదు జమ కానుంది. ఐదు ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు ఈ నెలాఖరు కల్లా వారి వాటా నిధులు అందుతాయి. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం, ప్రతి ఎకరాకు సాగు ఖర్చుల కోసం ప్రభుత్వం రూ. 6,000 ఆర్థిక సాయం అందిస్తోంది. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకే ఈ నగదు బదిలీ కానుండటంతో ఎక్కడా జాప్యం లేకుండా రైతులకు మేలు జరుగుతుంది.

# కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

కృత్రిమంగా పండించి విక్రయిస్తున్న వ్యాపారుల పట్ల జాగ్రత్త అవసరం. ఈ కల్తీ పండ్ల వల్ల ఆరోగ్య సమస్యలు రావడమే కాకుండా క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ విషయమై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ.సజ్జనార్ ఎక్స్ వేదికగా స్పందించారు. వేసవి కాలం రాకతో మామిడి మార్కెట్‌లో సందడి చేస్తోందని సజ్జనార్ అన్నారు. అయితే.. నోరూరించే ఈ ఫలాల మాటున ప్రాణాంతకమైన విషకోరలు దాగున్నాయన్న నిజాన్ని ప్రజల మరవకూడదని హెచ్చరిస్తూ.. ’కల్తీ మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త!’ అని ఎక్స్ వేదికగా వివరించారు. మార్కెట్లలో ఎక్కడైనా కల్తీ మామిడి పండ్లను విక్రయించినా, ఆ సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100కి గానీ, హెచ్–ఫాస్ట్ ఫోన్ నంబర్ 8712661212కు కాల్ చేయాలని సజ్జనార్ సూచించారు.

# గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

(మొదటి పేజీ తరువాయి)

మా రాజ్యం అంటే ఎవ్వరూ పట్టించుకోలేదు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌ది. అన్ని రంగాల్లో కేసీఆర్ వారికి రిజర్వేషన్లు తెచ్చారు. గిరిజనులకు ఇప్పుడు కాంగ్రెస్ చేసింది గుండు సున్నా. ఎస్సీ, ఎస్టీలకు డిక్లరేషన్ ఇచ్చి వారు చేసిందేమీ లేదు. రూ.2,730 కోట్లు ఎస్టీలకు బ్జడెట్‌లో పెట్టి కేవలం రూ.50 కోట్లే ఖర్చు చేశారు.గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.. ఒక్కరికీ ఇవ్వలేదు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యకు దూరం చేస్తున్నారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా ఇవ్వడం లేదని ఆక్షేపించారు. సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్టీల ఓట్లు కావాలిగానీ, వాళ్ల సంక్షేమం పట్టించుకోరా?అని ప్రశ్నించారు. కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామని బడాయి మాటలు చెబుతున్నారని విమర్శించారు.

# స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడారని గుర్తుచేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణపై మాట్లాడలేదని విమర్శించారు. ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచరని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలు, ఆసుపత్రులను సీఎం ప్రారంభిస్తున్నారని... వాళ్ళ దోపిడిని ఎంకరేజ్ చేస్తున్నారా అంటూ నిలదీశారు. ప్రైవేట్ స్కూల్స్ దోపిడీని కంట్రోల్ చేయాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్కూల్స్ ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ’అన్ని శాఖలకు ముఖ్యమంత్రే మంత్రిగా ఉండటం మన కర్మ’ అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో తనను నిజామాబాద్‌కు పరిమితం చేశారని అన్నారు. ఆంధ్రా, నార్త్ ఇండియా వాళ్ళు ఇక్కడ విద్యా సంస్థలు నెలకొల్పినా తెలంగాణ వాళ్ళకే అవకాశం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని.. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్దాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బిహార్ సిద్దాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు.

# జనగామ మార్కెట్‌లో అవినీతిపై విచారణ చేయాలి

**- మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్‌కు రైతు సంఘం వినతి పత్రం అందజేత**



తెలుగు గళం న్యూస్ జనగామ, ఏప్రిల్ 03

జనగామ వ్యవసాయ మార్కెట్‌లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనక రెడ్డి డిమాండ్ చేశారు.ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్‌కు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో పచ్చి వరి ధాన్యానికి కనీసం రూ.2000 ధర కల్పించాలని కోరారు.మార్కెట్‌లో వ్యాపారస్తులు చేపడుతున్న అక్రమాలు, జీరో దందాలను అరికట్టాలని అన్నారు.బిడ్డింగ్ ప్రక్రియను సమయపాలనతో నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని సూచించారు.దడవాయిలో కాంటా పూర్తైన వెంటనే తూకం పట్టీలు రైతులకు ఇవ్వకపోవడం వల్ల అవినీతి, అక్రమాలకు అవకాశం కలుగుతోందని, కాబట్టి తక్షణమే తూకం పట్టీలు ఇవ్వడం తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కాంటా పూర్తైన వెంటనే రైతులకు చెల్లింపులు చేయాలని కోరారు.కొంతమంది వ్యాపారులు కమిషన్ పేరిట రూ.2 నుండి రూ.5 వరకు వసూలు చేస్తున్నారని, ఇటువంటి అక్రమాలను వెంటనే నిలిపివేయాలని, రైతులకు పారదర్శకంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మార్కెట్ కార్యదర్శి అంజిత్ రావు, సూపర్వైజర్ శ్రీనివాస్, డైరెక్టర్ నాగబండి రవీందర్‌తో పాటు సంఘం నాయకులు సోప్పరి సోమయ్య, రామావత్ మీట్యా నాయక్, మోటి శ్రీశైలం, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిని సన్మానించిన సిపిఐ జాతీయ నాయకులు నారాయణ

తెలుగు గళం న్యూస్ హన్మకొండ ఏప్రిల్ 03



దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రాజారపు రత్నంను శుక్రవారం సిపిఐ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ నాయకుడు నారాయణ ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ దళితుల హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం సాధనకు ఉద్యమాలే మార్గమని, దళితులపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్నే బిక్షపతి తదితర నాయకులు పాల్గొన్నారు.

# వడ్డేపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

**- లంచాల ఆరోపణలపై కీలక పత్రాల స్వాధీనం**



తెలుగు గళం న్యూస్ హన్మకొండ ఏప్రిల్ 03

హనుమకొండ జిల్లా వడ్డేపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు.అక్రమ రిజిస్ట్రేషన్లు, లంచాల వసూళ్లపై వచ్చిన పక్కా సమాచారంతో అధికారులు కార్యాలయానికి చేరుకుని తలుపులు మూసివేసి సిబ్బందిని బయటకు వెళ్లనీయకుండా తనిఖీలు చేపట్టారు.సబ్ రిజిస్ట్రార్-1, సబ్ రిజిస్ట్రార్-2 చాంబర్లలోని రికార్డులు, రిజిస్ట్రేషన్ ఫైళ్లు, నగదు లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సోదాల సమయంలో సుమారు 20 మంది డాక్యుమెంట్ రైటర్లు 70 డాక్యుమెంట్లతో కార్యాలయం వద్ద వేచి ఉన్నట్లు సమాచారం.గత నాలుగు నెలలుగా రిజిస్ట్రేషన్ పూర్తయిన దాదాపు 200 డాక్యుమెంట్లను లంచం ఇవ్వలేదనే కారణంతో జారీ చేయకుండా వేధిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేరుగా రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన కొనుగోలుదారులకు కూడా అనవసర ఇబ్బందులు కలిగించారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటివరకు ఏజెంట్ల వద్ద నుంచి సుమారు రూ.45,500 నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అలాగే, కొంతమంది ఏజెంట్లకు సబ్ రిజిస్ట్రార్ సూచనల మేరకు రూ.1 లక్ష, రూ.50 వేలు ఇవ్వాలని సందేశాలు పంపినట్లు ఆధారాలు లభించినట్లు సమాచారం.ఈ సోదాలు వరంగల్ రేంజ్‌డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు నిర్వహిస్తున్నాయి. అక్రమ వసూళ్లు జరిగాయా? నిబంధనలు ఉల్లంఘించారా? అనే కోణంలో అధికారులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు అధికారిక ప్రకటనలో వెల్లడించాల్సి ఉంది.

# చింతకుంట్ల నరేందర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే కడియం శ్రీహరి





తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, ఏప్రిల్ 03

స్టేషన్ ఘనపూర్‌లోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతకుంట్ల నరేందర్ రెడ్డి సంతాప సభలో మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం మాట్లాడిన కడియం శ్రీహరి, నరేందర్ రెడ్డితో ఉన్న తన అనుబంధాన్ని స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. 1987లో రాజకీయాల్లోకి వచ్చిన తనకు మొదట అండగా నిలిచింది చింతకుంట్ల కుటుంబమేనని తెలిపారు.దాదాపు నాలుగు దశాబ్దాలుగా తమకు అండగా నిలిచిన ఈ కుటుంబం తన రాజకీయ ఎదుగుదలకు ఎంతో దోహదపడిందని చెప్పారు.స్టేషన్ ఘనపూర్ అభివృద్ధి కోసం నరేందర్ రెడ్డి అహర్నిశలు శ్రమించారని, ఆయన మరణం తనకు వ్యక్తిగతంగా తీరని లోటని పేర్కొన్నారు. ఘనపూర్‌కు 100 పడకల ఆసుపత్రి రావడంలో ఆయన పాత్ర ఎంతో కీలకమని, అలాగే ఇంటిగ్రేటెడ్ కార్యాలయం, డిగ్రీ కళాశాల వంటి అభివృద్ధి కార్యక్రమాల కోసం కూడా నిరంతరం కృషి చేశారని వివరించారు.ఘనపూర్ మున్సిపాలిటీగా రూపుదిద్దుకోవాలని, అక్కడ కాంగ్రెస్ జెండా ఎగరాలని ఆయన కోరుకున్నారని, ఆరోగ్యం సహకరించకపోయినా ప్రజాసేవలో ముందుండి పనిచేశారని అన్నారు.ప్రస్తుతం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న సమయంలో నరేందర్ రెడ్డి లేకపోవడం బాధాకరమని తెలిపారు.నరేందర్ రెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చిన శ్రీహరి, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఘనపూర్‌లో రూ.23 లక్షల గంజాయి పట్టివేత

**- ఇద్దరు నిందితులు అరెస్ట్ -- రిమాండ్‌కు తరలింపు**



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, ఏప్రిల్ 03

జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ రైల్వే స్టేషన్‌లో పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం, ఏప్రిల్ 2న మధ్యాహ్నం సుమారు 2:30 గంటల సమయంలో ఘనపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ రాజేష్ పిట్ట తన సిబ్బందితో కలిసి పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ వద్ద ఐదు బ్యాగులతో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక పురుషుడు, ఒక మహిళను గమనించారు. పోలీసులను చూసి వారు పారిపోవడానికి ప్రయత్నించగా, వెంటనే అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 46.4 కిలోల గంజాయి లభించింది.విచారణలో నిందితులు తమ పేర్లు సత్యరంజన్ బారెల్, దీప్తి మాయి స్వైన్ అని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ నుంచి ముంబై దాదర్‌కు గంజాయిని అక్రమంగా తరలించి విక్రయించాలనే ఉద్దేశంతో తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నారు.ఈ ఘటనపై ట్రైనీ ఐపీఎస్ మణీషా నెహ్రా పర్యవేక్షణలో మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుల వద్ద నుంచి 46.4 కిలోల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, రూ. 2,690 నగదు, ట్రైన్ టికెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులను ఏప్రిల్ 3న రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 23.20 లక్షలుగా అంచనా వేశారు.

# దొడ్డి కొమురయ్య ఆశయాలతో సమానత్వ పోరాటం కొనసాగిస్తాం: పాలడుగు నాగార్జున



తెలుగు గళం న్యూస్ । నల్గొండ । ఏప్రిల్ 03


తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధించడానికి కట్టుబడి ఉన్నామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున తెలిపారు. శుక్రవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం నిర్వహించిన సభలో నాగార్జున మాట్లాడుతూ, కొమురయ్య పేరు తెలంగాణ రైతాంగ పోరాటాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. సుమారు 1920 ప్రాంతంలో నల్గొండ జిల్లా కడవెండి గ్రామంలో జన్మించిన ఆయన, నిజాం పాలనలో సామంతుల దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన రైతాంగ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. 1946లో దొరల గుండాల కాల్పుల్లో అమరుడై, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి తొలి అమరుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు.ఆయన త్యాగంతో ఉద్యమం మరింత ఉధృతమైందని తెలిపారు.

కొమురయ్య పోరాట స్ఫూర్తి
సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడటం
పేద రైతుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేయడం
సమానత్వ సమాజం కోసం నిరంతర పోరాటం
సమాజానికి సందేశం
అన్యాయానికి ఎదురు నిలబడాలి
భూమి, జీవన హక్కుల కోసం ఐక్యత అవసరం
కుల, వర్గ భేదాలు లేకుండా సమాన హక్కులు ఉండాలి

యువత సామాజిక సమస్యలపై స్పందించి పోరాట పంథాను కొనసాగించాలిదొడ్డి కొమురయ్య జీవితం ప్రతి ఒక్కరికీ గొప్ప పాఠమని, అన్యాయం ఎక్కడ ఉన్నా ఎదుర్కొని ప్రజల కోసం పోరాడాలని నాగార్జున పిలుపునిచ్చారు. ఆయన జయంతి సందర్భంగా కొమురయ్య త్యాగాలను స్మరించుకుంటూ సమానత్వం, న్యాయం సాధనలో ముందుకు సాగుదామని అన్నారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు, సామాజిక ప్రజాసంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులు, గీతా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండా వెంకన్న, నరసింహ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అందుకు తండాలో ఘనంగా మధుకర్ నాయక్--సునీత వివాహ విందు

**- నూతన దంపతులకు ఆశీస్సులు అందించినటీఆర్పీ పార్టీ నాయకులు**



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి చిట్యాల జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల రూరల్ మండలం అందుకు తండా గ్రామంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకుడు మూడే మధుకర్ నాయక్ -- సునీత దంపతుల వివాహ విందు (రిసెప్షన్) కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ వేడుకకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ముఖ్య అతిథిగా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మధుకర్ నాయక్ సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు దగ్గరగా ఉండే నాయకుడని కొనియాడారు.నూతన దంపతులు జీవితంలో సుఖసంతోషాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో నిర్వహించిన ఈ వేడుక ఆనందోత్సాహాల మధ్య జరిగింది.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఇనుగాల ప్రణయ్ రాజ్, గండు కరుణాకర్, అనంతుల సంపత్ బొట్టు, వైద్య లక్ష్మణ్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నూతన దంపతులు భవిష్యత్తులో ఆనందకరమైన దాంపత్య జీవితం గడపాలని అందరూ ఆకాంక్షించారు.

## కరీంనగర్‌లో దారుణం.. ఇద్దరు చిన్నారులను బావిలో పడేసి హత మార్చిన తండ్రి..



**కరీంనగర్** రూరల్ మండలం జూబ్లీనగర్‌లో దారుణం జరిగింది. గ్రామానికి చెందిన కచ్చు శ్రీశైలం అనే ఓ ప్రైవేట్ ఉద్యోగికి ముక్కుపచ్చరాలని తన ఇద్దరు ఆడ పిల్లలను పొట్టనబెట్టుకున్నాడు. కన్నబిడ్డల పాలిట రాక్షసుడలా మారిన అతడు.. కవల పిల్లలైన ఇద్దరిని బావిలో పడేసి హతమార్చాడు. భర్యతో నిత్యం గొడవల కారణంగానే శ్రీశైలం ఈ ఘాతుకానికి పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు.శ్రీశైలం భార్య కవల ఆడపిల్లలకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి ఇద్దరు ఆడ పిల్లలకు జన్మనిచ్చావు అంటూ అతడు భార్యతో తరుచూ గొడవ పడుతుండేవాడు. గ్రామంలోని పెద్దలు అనేక సార్లు సర్ది చెప్పినా శ్రీశైలం తీరు మారలేదు. శుక్రవారం రోజు కూడా ఇదే విషయమై భార్యతో గొడవ పడిన శ్రీశైలం ఇద్దరు కూతుళ్లను తీసుకెళ్లి గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడేశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కోపంతో అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు.ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బావిలో వెతకగా ఒక పాప మృతదేహం లభించింది. మరో బాలిక మృతదేహం కోసం గజ ఈతగాళ్లతో వెతికిస్తున్నారు. ఇద్దరు చిన్నారులను బావిలో పడేయడానికి ముందు శ్రీశైలం వారికి గడ్డి ముందు తాగించినట్లు అనుమానిస్తున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

**- మరిపెడ ఎస్సై వీరభద్రరావు**

**హెల్మెట్ ధరించి ప్రయాణించే వారికి ప్రత్యేక కృతజ్ఞతలు**








**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**
ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుండి రక్షణ పొంది,సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకోవాలని మరిపెడ ఎస్సై వీరభద్రరావు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశాలనుసారం మండలంలోని ఉల్లెపల్లి, తాళ్ళఊకల్, మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని 8, 9 వ వార్డుల్లో 100% హెల్మెట్ ధరించి ప్రయాణించేలా మరిపెడ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన, ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి ప్రయాణించే వారికి ఎస్సై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై సురక్షితంగా ప్రయాణం సాగించేందుకు ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి సంవత్సరం చాలామంది వాహనదారులు రహదారి ప్రమాదాలలో కేవలం హెల్మెట్ ధరించని కారణంగా మరణిస్తున్నారని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం రహదారి ప్రమాదాలలో తలకు తీవ్ర గాయాలపాలై 'గోల్డెన్ అవర్స్" లో చికిత్స అందక విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకుని కుటుంబానికి భరోసా కల్పించేలా రక్షితమైన ప్రయాణం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

**- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో.**



**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**
తెలంగాణ ప్రభుత్వం మరియు కమిషనర్ బి.సి వెల్ఫేర్ గారు ఇచ్చిన సూచనలు మేరకు తెలంగాణ సాయుధ పోరాటలో తొలి అమరుడు అయన దొడ్డి కొమరయ్య జయంతి గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అదనపు కలెక్టర్ దొడ్డి కొమరయ్య చిత్రపటంకు పూలమాల వేసి నివాళులర్పించారు,ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన స్పూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమము నిర్వహించిన జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి. శ్రీనివాసరావు, వసతి గృహ సంక్షేమ అధికారులు,జిల్లా అధికారులు,ఐడిఓసి కార్యాలయ సిబ్బంది,మరియు జిల్లాలోని వివిధ యాదవ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన ఫ్రెండ్ సర్కిల్ చలివేంద్రం"





**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రియల్03(తెలుగుగళం)న్యూస్: సత్తుపల్లి పట్టణంలో**
జీవి మాల్ ఎదురుగా ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. గత 24 సంవత్సరాలుగా నిరంతరం కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది.ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానికులు, ప్రముఖులు పాల్గొని అభినందనలు తెలిపారు.ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ చలివేంద్రం ఆదర్శప్రాయంగా నిలుస్తోందని పలువురు పేర్కొన్నారు.

# రేగొండలో నూతన బస్సు సర్వీసు ప్రారంభం--ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం

**ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన బస్సు సర్వీసును ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఘంట సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై,బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి పచ్చ జెండా ఊపి సర్వీసును ప్రారంభించారు.పరకాల పట్టణం నుంచి ములుగు జిల్లా కేంద్రానికి వెళ్లే ఈ బస్సు సర్వీసు పరకాల -- రేగొండ -- జగ్గయ్యపేట -- అబ్బాపురం -- జాకారం గ్రామాల మీదుగా నడవనుంది.ఈ మార్గంలో ఉన్న గ్రామాల ప్రజలు ఇప్పటివరకు రవాణా సౌకర్యాల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉండగా,ఈ కొత్త సర్వీసు వారి ప్రయాణాలను సులభతరం చేయనుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రవాణా సౌకర్యాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు తమ విద్యా సంస్థలకు, ఉద్యోగులు తమ పనిస్థలాలకు, రైతులు మార్కెట్లకు వెళ్లేందుకు ఈ బస్సు సర్వీసు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం ఇలాంటి సేవలను మరింత విస్తరించేందుకు




కృషి చేస్తోందని అన్నారు.అలాగే భవిష్యత్తులో మరిన్ని గ్రామాలకు రవాణా సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజల అభ్యర్థనల మేరకు మరిన్ని బస్సు సర్వీసులు ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పరకాల డిపో ఆర్టీసీ డిఎం,ఎన్ ఎస్ ఆర్ సంస్థలా అధినేత,కోటంచ ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు, భూపాలపల్లి జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గుటోజు కిష్టయ్య, రేగొండ మండల సర్పంచ్ వారణాసి మౌనిక--అంజి,కాంగ్రెస్ జిల్లా నాయకులు మేకల బిక్షపతి, సూరం వీరేందర్, ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పున్నం రవి, మాజీ ఎంపీటీసీ పట్టేమ్ శంకర్, తిరుమలగిరి సర్పంచ్ చల్లగురుగుల సుదర్శన్,నారాయణపురం సర్పంచ్ గైకోటి రవి,ఉప సర్పంచ్ ఎలదండి నరేష్ , ఉమ్మడి మండలాల అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, కొత్తపల్లి గోరి మండల అధ్యక్షుడు సుధ బోయిన ఓం ప్రకాష్, సీనియర్ నాయకులు కటంగూరి మనోహర్ రెడ్డి,పసంగి,స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన బస్సు సర్వీసు ప్రారంభంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ,తమ ప్రాంతానికి ఇది ఎంతో ఉపయోగకరమైన నిర్ణయమని అభినందించారు.

# ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ 346వ వర్ధంతి

**శివాజీ త్యాగాలు,దేశభక్తి నేటి తరానికి ఆదర్శం--పిడిశెట్టి రాజు**

**తెలుగు గళం న్యూస్ సిద్దిపేట హుస్నాబాద్ కోహెడ**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలంలో హిందూ సామ్రాట్ చత్రపతి శివాజీ మహారాజ్ 346వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమాన్ని సామాజిక కార్యకర్త,కంటస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పిడిశెట్టి రాజు చత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం మాట్లాడుతూ, వాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యసాహసాలు,త్యాగనిరతి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.శివాజీ మహారాజ్ ప్రజలకు ఇచ్చిన సందేశం ఎంతో గొప్పదని, దేశాన్ని ముందుగా భావించి సేవ చేయాలని ఆయన చెప్పిన మార్గం ప్రతి ఒక్కరూ అనుసరించాల్సినదని అన్నారు.దేశం ముందు, తరువాత గురువు, తల్లిదండ్రులు, ఆ తరువాత దేవుడు అనే ఆలోచనను సమాజంలో నెలకొల్పిన మహనీయుడు శివాజీ మహారాజ్ అని



కొనియాడారు.అదేవిధంగా మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అడ్డుకుని,వారికి రక్షణ కల్పించిన గొప్ప నాయకుడిగా శివాజీ మహారాజ్ చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు.శివాజీ వంటి మహనీయుల త్యాగఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు నరాల శ్రీకాంత్,నేత అశోక్,ఆరెపల్లి ఉప సర్పంచ్ గొండ నర్సింహారావు,సామాజిక కార్యకర్త డాక్టర్ వేల్పుల జయశంకర్, బండ సుమన్ యాదవ్, కోయల్ కారి సతీష్, మయూరేష్, నరాల రాహుల్ నేత, కాయిత రామదాస్, భూమయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.వేడుకలు గౌరవప్రద వాతావరణంలో నిర్వహించబ డగా,పాల్గొన్నవారు శివాజీ మహారాజ్ సేవలను స్మరించుకుని ఆయన చూపిన మార్గంలో నడవాలని సంకల్పించారు.

# సొంత ఖర్చులతో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం

**- వైరా ఎస్సై పుష్పాలు రామారావు**



**వైరా,ఏప్రియల్03(తెలుగు గళం) న్యూస్:**
వైరా మండల పరిధిలోని కనకగిరి సిరిపురం గ్రామంలో గ్రామ వాసి షేక్ లతీఫ్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభోత్సవం వైరా ఎస్సై పుష్పాల రామారావు చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై రామారావు లతీఫ్ చేస్తున్న సేవలను అభినందించారు.గత 6 సంవత్సరాలుగా వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడంలో లతీఫ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రెగ్నెంట్ స్త్రీలను ఉచితంగా హాస్పిటల్ కు తన ఆటోలో తీసుకుపోవడం, తీసుకురావడం చాలా గొప్ప విషయమని అన్నారు.

సేవ చేయాలన్న తపన, సహాయం చేసే గుణం ఉండాలి కానీ ధనవంతులే అవసరం లేదని, తనకున్న కొద్ది మొత్తంలో రోజువారి సంపాదనలో కొంత భాగం పేద ప్రజల అవసరాలు తీర్చడానికి ఉపయోగ ఉపయోగించడం గొప్ప విషయం అన్నారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పరీక్ష ఫీజును ప్రతి సంవత్సరం తానే స్వయంగా చెల్లించడం ఆయన సేవా తత్పరతకు నిదర్శనమన్నారు.పేద విద్యార్థుల అవసరాలను తీర్చడం, వారి విద్యా సంబంధ కార్యక్రమాలకు సహకరించడం ఇతరులకు ఆదర్శనీయమైనది అన్నారు. అనేక ఇతర సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజల కలలో నాలుకల షేక్ లతీఫ్ నేటి యువతకు ఆదర్శం అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా గ్రామ సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, ప్రముఖ కవి, రచయిత ఐనాల సైదులు,ఉప సర్పంచ్ జంగా పుష్పావతి, వాకదాని శ్రీనివాసరావు, షేక్ సైదా, దుప్పటి కృష్ణారావు, హిమాం పాషా, మౌలాలి, తాటి వెంకటేశ్వర్లు, షేక్ జమీల్, నార పోగు తిరుపతిరావు, బొడ్డు హుస్సేన్ ,హరీష్ ,అశోక్ తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల ఉపాధిని దెబ్బతీయొద్దు--రాష్ట్ర చేనేత ఐక్య వేదిక

**రూ.105 కోట్ల యూనిఫామ్ టెండర్ రద్దుపై ఆగ్రహం వ్యక్తం చేసిన లింగమూర్తి**





**తెలుగు గళం న్యూస్ వరంగల్**
రాష్ట్రంలో చేనేత కార్మికుల ఉపాధిపై ప్రభావం చూపే విధంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను పునరాలోచించాలని రాష్ట్ర చేనేత ఐక్య వేదిక మీడియా కార్యదర్శి లింగమూర్తి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వరంగల్ జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం విద్యార్థుల యూనిఫామ్ తయారీ కోసం టెస్కో (తెలంగాణ చేనేత సహకార సంఘం)కు ప్రభుత్వం ఇస్తున్న ఆర్డర్లను ఈసారి రద్దు చేయడం చేనేత కార్మికుల జీవనాధారాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. ముఖ్యంగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన రూ.105.54 కోట్ల యూనిఫామ్ టెండర్‌ను రద్దు చేయడం వల్ల వేలాది మంది చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.దశాబ్దాలుగా విద్యాశాఖ, సంక్షేమ శాఖల పరిధిలోని విద్యార్థులకు దుస్తులు తయారు చేసే బాధ్యతను చేనేత సహకార సంఘాలు నిర్వహిస్తూ వస్తున్నాయని గుర్తుచేశారు.అయితే ఈసారి ప్రభుత్వం ఆర్డర్లను ఇవ్వకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.సాధారణంగా ప్రతి సంవత్సరం జనవరి నెలలో వచ్చే ఆర్డర్లు ఈసారి ఏప్రిల్ నాటికీ రాకపోవడంతో కార్మికులు ఆదాయం కోల్పోతున్నారని చెప్పారు.ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 393 చేనేత సహకార సంఘాల్లో పని కొరత తీవ్రంగా ఉందని,ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ ఆర్డర్లను కూడా నిలిపివేయడం అనేది కార్మికులపై మరింత భారాన్ని మోపుతున్నదని విమర్శించారు.విద్యార్థుల యూనిఫామ్ తయారీ పనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వంలోని వివిధ శాఖల నుంచి వచ్చే ఆర్డర్లను మళ్లీ చేనేత సహకార సంఘాలకు అప్పగించి, వారి ఆర్థిక స్థితిని మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలని లింగమూర్తి కోరారు. చేనేత రంగాన్ని రక్షించడం ద్వారా వేలాది కుటుంబాల జీవనోపాధి కాపాడవచ్చని ఆయన పేర్కొన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించి టెస్కోకు ఆర్డర్లు కేటాయించేలా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర చేనేత ఐక్య వేదిక తరఫున విజ్ఞప్తి చేశారు.

# దొడ్డి కొమరయ్య త్యాగాలు చిరస్మరణీయం- -ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**- భూపాలపల్లిలో ఘనంగా జయంతి వేడుకలు**




తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రముఖ యోధుడు దొడ్డి కొమరయ్య చేసిన త్యాగాలు,ఆయన చూపిన పోరాట స్ఫూర్తి ఎప్పటికీ చిరస్మరణీయమని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, దొడ్డి కొమరయ్య చూపిన ధైర్యం, అంకిత భావం, త్యాగనిరతి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం,న్యాయం, హక్కుల కోసం పోరాడిన మహనీయుల మార్గంలోనే మనమందరం ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన త్యాగస్ఫూర్తి ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. అనంతరం బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు దొడ్డి కొమరయ్య సేవలను స్మరించుకొని ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆయన జీవిత విశేషాలను గుర్తుచేసుకుంటూ, ఆయన చూపిన మార్గంలో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, సహాయ వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి క్రాంతి కిరణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్ అప్పం కిషన్, యాదవ సంఘ జిల్లా అధ్యక్షులు మేకల సంపత్, సదానందం, సతీష్, యాదవ మరియు కురుమ సంఘాల నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ జయంతి వేడుకలు భూపాలపల్లిలో గౌరవప్రద వాతావరణంలో నిర్వహించబడగా,పాల్గొన్న ప్రతి ఒక్కరూ దొడ్డి కొమరయ్యకు గౌరవంగా నివాళులు అర్పించారు.

# బుర్రకాయల గూడెంలో క్రికెట్ లీగ్‌కు ఉత్సాహభరిత ఆరంభం

**యువ క్రీడాకారులను ప్రోత్సహించిన జిల్లా అధ్యక్షుడు రవి పటేల్**

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి గణపురం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని రూరల్ బుర్రకాయల గూడెం గ్రామంలో నిర్వహిస్తున్న బుర్రకాయల గూడెం క్రికెట్ లీగ్ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్‌ను నిర్వాహకులు ప్రత్యేకంగా ఆహ్వానించగా, ఆయన హాజరై క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ, క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా భవిష్యత్తులో ఉన్నత అవకాశాలకు మార్గం చూపే వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఘనపూర్ మండల యువత తనపై చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర టీ 10 టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనను నియమించడం గర్వకారణమని పేర్కొంటూ, భూపాలపల్లి జిల్లాలో ఉన్న ప్రతిభావంతమైన యువ క్రికెట్ క్రీడాకారులను గుర్తించి జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. క్రీడాకారులు క్రమశిక్షణతో, సమయపాలనతో ఆడి తమ ప్రతిభను మెరుగుపరచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. ఈ క్రికెట్ లీగ్ ద్వారా గ్రామీణ యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందుతుందని, ఆరోగ్యకర మైన పోటీ వాతావరణం ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమ ంలో టిఆర్పి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఇనుగాల ప్రణయ్ రాజ్, సింగరేణి కార్మిక విభాగం అధ్యక్షులు అనంతుల సంపత్ బొట్టు, క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు గండు కరుణాకర్, జిల్లా నాయకులు వైద్య లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు, యువ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ లీగ్ ద్వారా యువతలో క్రీడలపై ఆసక్తి పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# మొగుళ్లపల్లిలో ఘనంగా శివాని--అశోక్ యాదవ్ వివాహ వేడుక

**నూతన దంపతులకు ఆశీస్సులు అందించిన టీఆర్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు కొటం రవి పటేల్**

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి మొగుళ్ళపల్లి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా రూరల్ మొగుళ్లపల్లి మండలంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ యూత్ అధ్యక్షుడు రవి కుమార్ యాదవ్ చెల్లెలి వివాహ వేడుక ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా బండారి శివాని--అశోక్ యాదవ్ వివాహ కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ, కుటుంబ బంధాలు సమాజానికి బలం అని, నూతన దంపతులు పరస్పర అవగాహనతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా జరిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఇనుగాల ప్రణయ్ రాజ్, జిల్లా సింగరేణి కార్మిక విభాగం అధ్యక్షులు అనంతుల సంపత్ బొట్టు, జిల్లా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు గండు కరుణాకర్, జిల్లా నాయకులు వైద్య లక్ష్మణ్ తదితరులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి ప్రత్యేక వన్నె తెచ్చారు. సాంప్రదాయ వాతావరణంలో జరిగిన ఈ వివాహ వేడుక ఆత్మీయతతో సాగింది. నూతన దంపతులు భవిష్యత్తులో ఆనందకరమైన దాంపత్య జీవితం గడపాలని, కుటుంబానికి సమాజానికి ఆదర్శంగా నిలవాలని కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆకాంక్షించారు.

# ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలి-- రేగొండ ఎస్సై దాసరి సుధాకర్ హెచ్చరిక

**డ్రంక్ అండ్ డ్రైవ్,పబ్లిక్‌లో మద్యం సేవనంపై కఠిన చర్యలు**






తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ మరియు ప్రజా ప్రవర్తన నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎస్సై దాసరి సుధాకర్ ప్రజలకు సూచించారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్సై దాసరి సుధాకర్ మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. రోడ్లు, పార్కులు మరియు ఇతర ప్రజా ప్రదేశాలలో మద్యం సేవించే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మద్యం సేవించి వాహనం నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్) తీవ్రమైన నేరమని, ఇటువంటి ఘటనలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ డ్రైవర్లు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ఈ నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అలాగే 18 సంవత్సరాలు నిండని మైనర్లు వాహనాలు నడపరాదని,తల్లిదండ్రులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. రోడ్లపై అనధికారికంగా వాహనాలు నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని,నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను గౌరవించి పోలీసులకు సహకరించాలని సూచించారు. వదంతులు, అపోహలను నమ్మకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్సై దాసరి సుధాకర్ పిలుపునిచ్చారు. పోలీసులు ప్రజల భద్రత కోసం కట్టుబడి పనిచేస్తున్నారని, నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.

# వెంకటాపురంలో ఘనంగా శుభ శుక్రవారం సిలువ మార్గం"





**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రియల్03(తెలుగుగళం) న్యూస్:**సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం వెంకటాపురంలో శుభ శుక్రవారం సందర్భంగా శుక్రవారం బహిరంగంగా సిలువ మార్గం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వాసులు భారీగా తరలివచ్చారు.
విచారణ గురువులు ఫాదర్ తంబీ (సీపీపీఎస్) మాట్లాడుతూ యేసుక్రీస్తు జీవితం మానవాళికి ఆదర్శమని పేర్కొన్నారు. మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, అపారమైన సహనం, అవధులు లేని త్యాగం వంటి విలువలను యేసు ప్రపంచానికి అందించారని తెలిపారు. శుభ శుక్రవారం యేసు మహా త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో దీక్ష బిడ్డలు, మరియదల సభ్యులు, యువతీ యువకులు, ఉపదేశికులు పాల్గొన్నారు. విచారణ పరిధిలోని ఆరు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సిలువ మార్గాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# ఐఎస్‌బీలో రామోజీ ఆడిటోరియం ప్రారంభం - ప్రపంచ స్థాయి సౌకర్యాలతో నిర్మాణం




**హైదరాబాద్** ప్రఖ్యాత ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్- (ఐఎస్‌బీ)లో రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు, దివంగత రామోజీ రావు పేరుతో ఆడిటోరియాన్ని నిర్మించారు. రూ. 30 కోట్ల నిధులతో 450 మంది విద్యార్థులు కూర్చునే విధంగా ప్రపంచ స్థాయి సౌకర్యాలతో రామోజీ ఫౌండేషన్ ఆడిటోరియాన్ని తీర్చిదిద్దారు. ఐఎస్‌బీ ప్రొఫెసర్లతో కలిసి రామోజీ కుటుంబసభ్యులు ఈ ఆడిటోరియాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ సమావేశాలు, పరిశోధన సెమినార్లు, విశిష్ట ఉపన్యాసాలు, విద్యా సంబంధ కార్యక్రమాలకు ఆడిటోరియం ఉపయుక్తం కానుంది.
దార్శనికుడు, రామోజీగ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు, దివంగత రామోజీరావు పేరుతో హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్-ఐఎస్‌బీలో అత్యాధునిక ఆడిటోరియం నిర్మితమైంది. 450 మంది కూర్చునేందుకు వీలుగా ప్రపంచస్థాయి సౌకర్యాలతో నిర్మించిన రామోజీ ఆడిటోరియాన్ని రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్?డమేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్ కుటుంబ సమేతంగా కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరి, రామోజీ మనవడు సుజయ్, మనువరాళ్లు సహరి, కీర్తి సోహన, బృహతి, ఈటీవీ ఎండీ బాపినీడు, ఆడిటర్ సాంబశివరావు పాల్గొన్నారు.
ఆఖరి శ్వాస వరకూ నేర్చుకుంటూనే ఉన్నారు : రామోజీరావు కుటుంబ సభ్యులను ఐఎస్?బీ ప్రతినిధులు సాదరంగా ఆహ్వానించగా తొలుత ఆడిటోరియం ప్రాంగణంలో పారిజాత మొక్కను నాటారు. అనంతరం ఐఎస్‌బీలో రామోజీ ఆడిటోరియం శిలాఫలకాన్ని కుటుంబ సభ్యులు ఆవిష్కరించారు. ఐఎస్‌బీలోని రామోజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, ఐఎస్?బీ ప్రొఫెసర్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌బీ ఛైర్మన్ హరీశ్ మన్వానీ, డీన్ మదన్ పిల్లుట్ల, ప్రొఫెసర్ రామ్‌లతో పాటు పారిశ్రామికవేత్తలు జీవీ ప్రసాద్, శ్రీనీ రాజు పాల్గొన్నారు. నిత్య విద్యార్థి అయిన రామోజీరావు పేరుతో ఐఎస్‌బీలో ఆడిటోరియం ఉండటంపై సంతోషం వ్యక్తం చేసిన కిరణ్ ఆఖరి శ్వాస వరకూ నేర్చుకుంటూనే ఉన్న రామోజీరావే తమకు ఆదర్శమని పేర్కొన్నారు.
ప్రజల్లో చెరగని ముద్ర వేశారు : విరాళానికి, నిబద్ధతకు తేడా ఉంటుందన్న ఐఎస్‌బీ ఛైర్మన్ హరీశ్ మన్వానీ సమాజం పట్ల అంకిత భావాన్ని రామోజీ కుటుబ సభ్యుల్లో చూశానని అన్నారు. తాను ఓ కార్పొరేట్ సంస్థలో పనిచేస్తున్న సమయంలో ఈనాడులో అడ్వర్టైజ్‌మెంట్ రాకుంటే తెలుగు ప్రజలకు చేరువకాలేమని భావించేవారమన్నారు. సమాజం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపే రామోజీరావు ప్రజల్లో చెరగని ముద్ర వేశారని ఐఎస్?బీ ప్రొఫెసర్ రామ్ అన్నారు. కార్యక్రమం అనంతరం ఐఎస్‌బీ ప్రతినిధులు రామోజీ కుటుంబ సభ్యులకు జ్ఞాపికను అందజేశారు.
ఐఎస్‌బీ మౌలిక వసతుల కల్పన కోసం రామోజీటీమ్, సమీకృత లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్, డెడికేటెడ్ గెస్ట్ లాంజ్‌లతో పాటు ప్రపంచ స్థాయి కాన్ఫరెన్స్‌లు నిర్వహించేందుకు వీలుగా ఆడిటోరియాన్ని తీర్చిదిద్దారు. అంతర్జాతీయ సమావేశాలు, పరిశోధన సెమినార్లు, విశిష్ట ఉపన్యాసాలు, ఇతర విద్యాసంబంధ కార్యక్రమాల నిర్వహణకు ఈ ఆడిటోరియం ఎంతో ఉపయోగపడనుంది. ప్రపంచ మేధో నాయకత్వానికి కేంద్రంగా ఐఎస్?బీ పాత్రను బలోపేతం చేయనుంది. "నాన్న గారు గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ నిర్వహణ, ఆలోచనా విధానంలో ఆయన ఒక గొప్ప ఆవిష్కర్త. నాన్న పుస్తక ప్రేమికుడు. 1960, 70ల కాలంలోనే ఆయన డేల్ కార్నెగీ, పీటర్ డ్రక్కర్ వంటి పుస్తకాలను విపరీతంగా చదివేవారు. ఆయన చివరి రోజుల వరకు గొప్ప పాఠకుడిగా ఉండేవారు. అలాగే ప్రతిరోజు ఒక కొత్త పాఠం ప్రతి అనుభవం నుంచి నేర్చుకోవాలని మాకు ఎప్పుడు చెబుతుండేవారు. ఆయన సిద్ధాంతాల కంటే ఆచరణను ఎక్కువగా నమ్మేవారు. మీరు ఎన్ని చదువులైనా చదవండి, కానీ తిరిగి వచ్చాక రామోజీ యూనివర్సిటీలోనే కష్టపడి పనిచేస్తూ మీ స్థానాన్ని సంపాదించుకోవాలని చెప్పేవారు. మీ కోసం ఎటువంటి సౌకర్యాలు వేచి ఉండవని ప్రతి ఒక్కరు శ్రమించాల్సిందేనని అంటుండేవారు. కార్పోరేట్ స్థాయిలో వ్యక్తుల అభివృద్ధి, సమాజం పట్ల ఆయనకు ప్రత్యేక శ్రద్ధ ఉండేది. వేలాది మంది విద్యార్థులు ఈ ద్వారా ఆయన జ్ఞాపకాలను స్మరించుకుంటూ ముందుకు వెళ్తారని ఆశిస్తున్నాము. ఇదే హాల్

## కల్తీ మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త! - హైదరాబాద్ సీపీ సజ్జనార్ పోస్ట్ వైరల్



**హైదరాబాద్** అసలే ఇది నోరూరించే మామిడి పండ్ల సీజన్. మార్కెట్లో ఆ తియ్యటి వాసన సందడి చేసే కాలం. ఈ వేసవిలో నిగనిగలాడుతూ కనిపించే ఈ మామిడి ఫలాల మాటున ప్రాణాంతకమైన విషపు కోరలు దాగి ఉన్నాయన్న వాస్తవాన్ని మర్చిపోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. కొందరు స్వార్థపరులైన వ్యాపారులు డబ్బుల కక్కుర్తి కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సహజ రీతిలో పక్వానికి రావాల్సిన మామిడిని కాల్షియం కార్బైడ్ వంటి కెమికల్స్ వినియోగించి కృత్రిమంగా మగ్గించి విక్రయిస్తున్నారని సజ్జనార్ వెల్లడించారు. రోడ్డు పక్కన బండ్లపై నిగనిగలాడుతూ, గోల్డెన్ కలర్?లో కంటికి అత్యంత ఆకర్షణీయంగా కనిపించే ప్రతి పండూ నాణ్యమైనదే అనుకొని కొనడమంటే అనారోగ్యాన్ని కొనితెచ్చుకోవడమేనంటూ సోషల్ మీడియా 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

తింటే అనర్థమే! : సాధారణంగా సహజంగా పండిన పండు అంతటా ఒకే రంగులో ఉండదని సీపీ సజ్జనార్ అన్నారు. కానీ రసాయనాలతో మగ్గించిన పండ్ల పైన పసుపు పచ్చగా ఉండి, లోపల మాత్రం పచ్చిగా ఉండి విషతుల్యంగా మారుతాయని చెప్పారు. ఇలాంటి పండ్లను తినడం వల్ల గొంతు దగ్గర మంట, వాంతులు, విరేచనాలు, కడుపులో వికారం వంటి తక్షణ సమస్యలతో పాటు, దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థ దెబ్బతినడం, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు.

కల్తీపై హెచ్-ఫాస్ట్ నిఘా : ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే ఇలాంటి కల్తీ వ్యాపారుల పట్ల హైదరాబాద్ పోలీస్ విభాగం ఇప్పటికే ఉక్కుపాదం మోపుతోందని సజ్జనార్ స్పష్టం చేశారు. కల్తీ మామిడి పండ్లపైనా హెచ్-ఫాస్ట్ (హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్) పటిష్టమైన నిఘా ఉంచుతోందని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు రూపాన్ని చూసి మోసపోకుండా, సహజత్వాన్ని గుర్తించి పండ్లను కొనుగోలు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. సహజంగా పండిన పండ్ల కంటే అసహజమైన రంగు, రసాయన వాసన, వింత రుచి కలిగిన మామిడి పండ్ల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. పండ్లపై అసాధారణ మచ్చలున్నా లేదా బేకింగ్ సోడా నీటిలో కడిగినప్పుడు రంగు మారినా అవి ఆరోగ్యానికి చాలా హానికరమని గ్రహించాలని సూచించారు. కల్తీ మామిడి పండ్ల సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100కి గానీ, హెచ్-ఫాస్ట్ ఫోన్ నంబర్ 8712661212కు సమాచారం ఇవ్వాలని సజ్జనార్ పోస్ట్?లో విజ్ఞప్తి చేశారు.

7 టన్నుల మామిడి పండ్లు స్వాధీనం : హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌లోని గోదాంలో హెచ్ ఫాస్ట్ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. మామిడిపళ్లను హానికర రసాయనాలతో మక్కపెడుతున్న వ్యాపారి గోదాంలో సుమారు 7 టన్నుల మామిడిపండ్లు స్వాధీనం చేసుకున్నారు. గోదాం నిర్వాహకులు జమీల్, ఫరీద్‌పై కేసు నమోదు చేసి గోదాంను సీజ్ చేశారు.

## వాట్సాప్‌లో తెలంగాణ ప్రభుత్వ సేవలు.. ఇక నుంచి మీ సేవ, ఇంటర్నెట్ సెంటర్ల చుట్టూ తిరగక్కర్లేదు

**హైదరాబాద్** తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ సేవల వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఒక్క క్లిక్‌తో ప్రభుత్వ సేవలను.. మన అరచేతిలోకే తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతోంది. మీ-సేవ, ఇంటర్నెట్ సెంటర్ల చుట్టూ తిరిగే అవకాశం లేకుండా.. సెల్‌ఫోన్‌లోనే చూసుకునేలా ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ పాలనను.. ప్రజల చేతిలోకి తీసుకువచ్చేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మీ-సేవ ద్వారా




అందే సేవలు, ఇంటర్, పది పరీక్షల హాల్ టికెట్లను ఇప్పటికే వాట్సాప్‌లో అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వం.. ప్రభుత్వ సేవలను కూడా డిజిటల్‌గా అందుబాటులోకి తెస్తోంది.

ఒక్కొక్కటిగా వివిధ శాఖల సేవలను కూడా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్‌తో లింక్ చేస్తోంది. ఇలా చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ప్రతీ సేవకు సంబంధించిన లింక్ ఒక్క వాట్సాప్ మెసేజ్‌తో అరచేతిలోకి రానుంది. అదే సమయంలో భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి ఉద్యోగ పరీక్షలకు సంబంధించిన రిక్రూట్‌మెంట్ బోర్డులు కూడా ఈ వాట్సాప్‌నే వినియోగించేలా ప్లాన్లు కూడా జరుగుతున్నాయి. ఇక ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్ అయి వాట్సాప్‌లో అందుబాటులోకి వస్తే.. ఇంటర్నెట్ సెంటర్లు, మీ-సేవ సెంటర్ల చుట్టూ తిరిగే పని లేకుండా కేవలం వాట్సాప్ ద్వారా ప్రజలకు సేవలు అందుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

ఈ వాట్సాప్ సేవల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 80969 58096 అనే నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో వేర్వేరు డిపార్ట్‌మెంట్‌లకు వేర్వేరుగా ఉన్న పోర్టల్‌లతో తీవ్ర గందరగోళం ఏర్పడగా.. దానికి స్వస్తి పలుకుతూ ఈ ఇంటిగ్రేటెడ్ విధానాన్ని తీసుకువచ్చి అన్ని సేవలకు ఒకే వాట్సాప్ నంబర్‌ను తీసుకువచ్చారు. ప్రజల ఫిర్యాదుల దగ్గరి నుంచి సర్టిఫికెట్ల జారీ వరకు అన్నింటినీ ఒకే దగ్గరికి చేర్చే విప్లవాత్మక మార్పులు తెస్తున్నారు. కేవలం సమాచారం కోసమే మాత్రమే కాకుండా నేరుగా సేవలు పొందే వేదికగా మార్చారు.

ఇటీవల పలు ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన హాల్ టికెట్లను కూడా వాట్సాప్‌లో అందుబాటులో ఉంచారు. కేవలం రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ, పేరు వంటి వివరాలు ఎంటర్ చేయగానే హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే అవసరం కల్పించారు. రానున్న రోజుల్లో స్టేట్ లెవల్ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను కూడా వాట్సాప్‌లోనే అందించనున్నారు. రిజల్ట్స్ కూడా తెలుసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. ప్రభుత్వ మెసేజ్‌లు, అలర్ట్‌లు కూడా ఇదే వాట్సాప్ నంబర్ ద్వారా ప్రజలకు చేరునున్నాయి.

ప్రస్తుతం మీ-సేవ పోర్టల్‌లో లభించే దాదాపు అన్ని సేవలు వాట్సాప్‌లో అందుతున్నాయి. కులం, ఆదాయం వంటి సర్టిఫికెట్లు, వాటి స్టేటస్ తెలుసుకోవడం దగ్గరి నుంచి మున్సిపల్ ట్యాక్స్‌ల చెల్లింపు వరకు వాట్సాప్‌లో అందుబాటులో ఉన్నాయి. రెవెన్యూ, విద్యుత్, పౌరసరఫరాల వంటి కీలక శాఖల సమాచారం కూడా అరచేతిలోకి తెచ్చారు. హాయ్ అని ఒక్క మెసేజ్ చేస్తే చాలు ఆప్షన్లతో కూడిన మెనూ ప్రత్యక్షం అవుతుంది.

రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అన్నింటినీ ఈ వాట్సాప్ చాట్‌బాట్‌కు లింక్ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి వంటి పథకాలకు దరఖాస్తు చేసుకోవడం.. అర్హతలు చెక్ చేసుకోవడం, రేషన్ కార్డులు, పెన్షన్ల జారీ మరింత సులభం కానుంది. లబ్ధిదారుల అకౌంట్లలో ప్రభుత్వం వేసే డబ్బుల సమాచారం కూడా వాట్సాప్ మెసేజ్‌లో అందించనున్నారు. ఒకే నంబర్‌తో రాష్ట్ర ప్రజలందరికీ అన్ని ప్రభుత్వ సేవలు అందేలా వన్ స్టాప్ షాప్ విధానాన్ని తీసుకురానున్నారు.

## మదనపల్లిలో ఘనంగా రోహిత్--కావేరి (అమూల్య) వివాహ విందు

**- నూతన దంపతులకు ప్రముఖుల ఆశీస్సులు-**
**-భారీగా హాజరైన ప్రజాప్రతినిధులు**



**తెలుగు గళం న్యూస్ ములుగు**

ములుగు జిల్లా మదనపల్లి గ్రామంలో రోహిత్ -- కావేరి (అమూల్య) వివాహ రిసెప్షన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకలో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. పోరిక అర్పిత -- ఉత్తమ్ కుమార్ దంపతుల కుమారుడు రోహిత్ మరియు జరుపుల సూర్యకళ -- రమేష్ దంపతుల కుమార్తె కావేరి (అమూల్య) వివాహ రిసెప్షన్ వేడుక ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, ఆతిథ్యాన్ని ఘనంగా నిర్వహించి అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి పోరిక జగన్ నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బాలరాం నాయక్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, లంబాడీల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పల్లవి రాజు నాయక్ తదితరులు హాజరయ్యారు. వారు నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖశాంతులతో కొనసాగాలని ఆకాంక్షించారు. అలాగే పలు ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, యువ నాయకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేడుక వేదిక సాంస్కృతిక వాతావరణంలో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో పోరిక విజయ్ కుమార్, వగావత్ వరుణ్ నాయక్, భూక్య శ్రవణ్ కుమార్, రామల్ నాయక్, పోరిక రామన్న నాయక్, కొర్ర విమల జట్ మాల్, నారాయణ సింగ్, సక్రు నాయక్, రవినాథ్, హరికృష్ణ, బాలకృష్ణ, ధారావత్ రాంచందర్ నాయక్, రాజేష్, వేణు, రాజన్న, రవి, రామ్ కుమార్, అజ్మీరా జపాల్ సర్పంచ్, ప్రతాప్ సింగ్, రంజిత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## యస్.బి.ఐ.టి. లో అట్టహాసంగా ఆరోహన్ - 26

**ఆటపాటలతో సందడి చేసిన విద్యార్థులు**
**ముఖ్య అతిథిగా హాజరైన డి.ఆర్.డి.ఒ. డి.జి.యమ్. రామస్వామి**








**తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం ఏప్రిల్ 03, ఖమ్మం జిల్లా** : ఖమ్మం యస్.బి.ఐ.టి. అటానమస్ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆరోహన్ - 2026 విద్యార్థుల కేరింతల నడుమ వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో 40 కి పైగా ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించి వాటి పనితీరు గురించి పూర్తిగా వివరించారు. తొలుత ఆరోహన్ కార్యక్రమాన్ని డి.ఆర్.డి.ఒ. డి.జి.యమ్., భారత్ డైనమిక్స్ లిమిటిట్ డిప్యూటి జనరల్ మేనేజర్ రామస్వామి సౌందర్యరాజన్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంబించారు.

ఈ సందర్భంగా స్వాగత నృత్యంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో రామస్వామి మాట్లాడుతూ ప్రస్తుత కృతిమ మేధస్సు యుగంలో ఉద్యోగభద్రత, ఉద్యోగాలపై ఆందోళన ఉన్న నేపద్యంలో కృతిమ మేధస్సుకు సరియైన సమాధానం మానవ మేధస్సే అని అన్నారు. మానవ మేధస్సును ఉపయోగించి నూతన ఆవిష్కరణలు చేస్తే విద్యార్థుకు ఉజ్వలభవిష్యత్తు ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రస్తుత యుగంలో డ్రోన్ టెక్నాలజి బహుళప్రయోజనాలను సమకూరుస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ అంశంపై దృష్టి సారించి నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నూతన ఆవిష్కరణల కోసం ఇన్నోవేషన్ సెల్ ఏర్పాటు చేసామని తెలిపారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే హ్యాకథాన్, ఐడియాథాన్ వంటి పోటీలలో పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధిస్తూన్నారని తెలిపారు. దీనికంతటికి రోజురోజుకి మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తాము శిక్షణను ఇవ్వడమే కారణమని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మట్లాడుతూ విద్యార్థులు వారి సొంత ఆలోచనలతో భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే నూతన ఆలోచనలతో ఆరోహన్ 2026 సందర్భంగా ప్రాజెక్ట్ ఎక్స్‌ఫోలను ప్రదర్శించటం కళాశాలకు గర్వకారణమన్నారు. వైస్‌ఛైర్మన్ కె. శ్రీచైతన్య మాట్లాడుతూ రోబోటెక్నాలజీలో ఈ ఆరోహన్ ప్రారంభ ఉత్సవాలు నిర్వహించడం కళాశాలకు ఉన్న సాంకేతిక సత్తాను తెలియచేస్తుందని అన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా॥ జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోహన్ 2026 టెక్నికల్ ఫెస్ట్ సందర్భంగా ఇతర కళాశాలల నుండి సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొని పోటీతత్వాన్ని చాటారన్నారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధాన చేసారని ఆయన వెల్లడించారు.

ఆకట్టుకున్న ప్రాజెక్ట్ ఎక్స్‌పో:
ఆరోహన్ 2026 టెక్నికల్ ఎక్స్‌పో సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 40 ప్రాజెక్టులు అతిధులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థుల వివరణలో ప్రారంభం నుంచి ఏవిధమైన టెక్నికల్ విధానాన్ని అవలంభించారో వంటి వివరాలు అతిధులు తెలుసుకొని వారిని అభినందించారు. అనంతరం వివిధ ఇంజనీరింగ్ విభాగాలలో జరిగిన సాంకేతిక పోటీలైన కోడ్ డిబగ్గింగ్, సర్క్యూట్రిక్స్, క్విజ్, యంగ్ మేనేజర్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్స్ అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:
ఖమ్మం, యస్.బి.ఐ.టి. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఆరోహన్ టెక్నికల్ ఫెస్ట్ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ఆటపాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా క్లాసికల్, వెస్టన్, బ్రేక్ తదితర నృత్యాలు ప్రదర్శించి చూపరులను మైమరింపచేసారు. అదేవిధంగా గ్రూప్ డ్యాన్సలతో కూడా విద్యార్థులను హోరెత్తించారు. మొత్తం మీద ఆరోహన్ 2026 కార్యక్రమం విద్యార్థుల కేరింతల నడుమ వారికి ఆనందాన్ని ఇస్తూ ముగిసంది. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో అత్యవసర వైద్య సిబ్బంది జాతీయ ఈఎంటి దినోత్సవ వేడుకలు"












**ఖమ్మంజిల్లా/సత్తుపల్లి, ఆర్ సి, ఏప్రిల్ 3(తెలుగుగళం)న్యూస్** : ఖమ్మం జిల్లాలో 108 అత్యవసర అంబులెన్స్ సేవల్లో పనిచేస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటి)లకు జాతీయ ఈఎంటి దినోత్సవం సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. సత్తుపల్లిలో జరిగిన ఈ కార్యక్రమం 108 సేవల ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్, జిల్లా మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సందర్భంగా ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్ చేతుల మీదుగా కేక్ కటింగ్ నిర్వహించి, ఈఎంటీలను శాలువాలతో సత్కరించారు. వారి సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఈఎంటీలు గొల్లమందల కృష్ణ, యర్రం అప్పారావు, కాకర్ల మాధవరావు, తేనేటి మురళీకృష్ణ పాల్గొన్నారు. 2005 ఆగస్టు 15న ప్రారంభమైన 108 అత్యవసర సేవలు అప్పటి నుంచి ఇప్పటివరకు రోగులు, క్షతగాత్రులు, కరోనా బాధితులకు నిరంతరం సేవలు అందిస్తున్నాయి. కోవిడ్ కరోనా సమయంలో ఉద్యోగులు దశలవారీగా హైదరాబాద్‌కు వెళ్లి విధులు నిర్వహించడం జరిగింది. మండల స్థాయిలో 24 గంటలు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించారు. గత ఏడాది కాలంలో జిల్లాలో మొత్తం 26,707 మందికి సేవలు అందించగా, అందులో రోడ్డు ప్రమాదాలు 4,146, గర్భిణీ స్త్రీలు 3,227, వైద్య కేసులు 8,695, గుండె సంబంధిత కేసులు 1,828, విషప్రయోగ కేసులు 1,353, పాము కాటు మరియు తేళ్ల కాటు కేసులు 725 నమోదయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే క్షణాల్లో ఘటనాస్థలికి చేరుకుని ప్రథమ చికిత్స అందించడం, ఉచిత ఆసుపత్రి సేవలు కల్పించడం, బాధితులను బాధ్యతాయుతంగా ఆసుపత్రులకు తరలించడం వంటి సేవలను ఈఎంటీలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. అనేక సందర్భాల్లో గర్భిణీ స్త్రీలకు అంబులెన్స్‌లోనే ప్రసవాలు నిర్వహించి ప్రాణాలను కాపాడిన ఘటనలు చోటుచేసుకున్నాయి.

జిల్లా మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్, ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్ ప్రోత్సాహంతో 'గోల్డెన్ అవర్' విధానాన్ని పాటిస్తూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సకాలంలో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సేవా భావంతో ముందుకు సాగుతున్న ఈఎంటీలకు జాతీయ ఈఎంటి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# శాంసన్‌కు పసుపు జెర్సీ పరీక్ష.. ఈసారైనా ధోనీని తలపించేనా..

పొట్టి ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ అర్ధ శతకాలతో రెచ్చిపోయిన సంజూ శాంసన్ ఐపీఎల్‌లో తొలిసారి కఠిన పరీక్ష ఎదుర్కొంటున్నాడు. భారీ అంచనాల నడుమ చెన్నై సూపర్ కింగ్స్‌జెర్సీతో ఆడుతున్న సంజూ తొలి మ్యాచ్‌లో తేలిపోయాడు. ఎంఎస్ ధోనీవారసత్వాన్ని కొనసాగిస్తాడని ఫ్రాంచైజీ, అభిమానులు అతడిపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేశాడీ హిట్టర్. ఈ నేపథ్యంలో రెండో మ్యాచ్‌లో తన మార్క్ విధ్వంసంతో రెచ్చిపోవాలని భావిస్తున్నాడు.




ఐపీఎల్‌లో తొలిసారి చెన్నై సూపర్ కింగ్స్ ఆడుతున్న సంజూ శాంసన్ మొదటి మ్యాచ్‌లో తేలిపోయాడు. ఎన్నో అంచనాల మధ్య పసుపు జెర్సీతో క్రీజులోకి వచ్చిన సంజూ.. రెండో ఓవర్లోన క్లీన్‌బౌల్డయ్యాడు. నంద్రె బర్గర్ వేసిన ఆ ఓవర్లో చివరి బంతికి డిఫెన్స్ ఆడాలనుకున్న శాంసన్ అంచనా తప్పగా.. బంతి మెరుపు వేగంతో ఆఫ్ స్టంప్‌ను ఎగరగొట్టింది. అంతే.. స్టాండ్స్‌లోని వందలాది మందిని నిరాశకు గురి చేసిన సంజూ భారంగా పెవిలియన్ బాట పట్టాడు.తొలి మ్యాచ్‌లో ఘోరంగా విఫలమైన శాంసన్ పంజాబ్ కింగ్స్‌పై దంచేయాలనే కసితో ఉన్నుడు. పంజాబ్ కింగ్స్‌పై పిడుగల్లే విరుచుకుపడి సీఎస్కే ట్రంప్‌కార్డ్ అవ్వాలనుకుంటున్న శాంసన్ నెట్స్‌లో చెమటోడ్చాడు. మరి.. మైదానంలో అదరగొడతాడా? లేదా? లేదా అని కోట్లాది మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ఫామ్ పరంగా ఏమాత్రం ధోకా లేని అతడికి లెగ్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ నుంచి ముప్పు పొంచి ఉంది.ఇప్పటివరకూ12 ఇన్నింగ్స్‌ల్లో 5 సార్లు అతడు చాహల్ ఓవర్లో ఔటయ్యాడు. ఈ లెక్కన చూస్తే.. శాంసన్‌ను ఔట్ చేసేందుకు పంజాబ్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ స్పిన్ మాంత్రికుడిని ఆయుధంగా ఉపయోగించే అవకాశముంది. మరోవైపు.. ఈ మ్యాచ్‌లో అర్ధ శతకంతో చెలరేగి ధోనీ వారసుడిగా ప్రశంసలు అందుకోవాలని శాంసన్ అనుకుంటున్నాడు. గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ రెండు వారాలు అందుబాటులో ఉండడు. సో.. అటు వికెట్‌కీపర్, ఇటు ఓపెనర్‌గా రాణించి అతడు తాలాను తలపించాలని అభిమానులు ఆశిస్తున్నారు.అర్ధ శతకాల హోరుసొంతగడ్డపై జరిగిన టీ20 ప్రపంచకప్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ విఫలమైనా సంజూ శాంసన్ మెరిశాడు. క్వార్టర్ ఫైనల్ లాంటి సూపర్ 8 చివరి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై 97 నాటౌట్‌లో జట్టును గెలిపించాడు. ఆపై సెమీఫైనల్లోనూ అబి ,షేక్ త్వరగా ఔటైనా.. ఇంగ్లండ్ బౌలర్లను కాచుకున్న సంజూ 89 పరుగులతో రెచ్చిపోయాడు. ఫైనల్లోనూ ఈ కేరళ స్టార్ దంచ ేశాడు.న్యూజిలాండ్ బౌలర్లను బాదేస్తూ అభిషేక్(52)తో కలిసి తొలి వికెట్‌కు 98 రన్స్ స్కోరందించాడు.

## ముంచుకొస్తున్న గ్యాస్ సంక్షోభం.. పాత బుకింగ్‌లకే దిక్కులేని పరిస్థితి



వంటగదిలో గ్యాస్ వెలగడం లేదు.. సిలిండర్ కోసం సామాన్యుడి నిరీక్షణ తీరడం లేదు. దేశీయంగా ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. గత రెండు నెలలతో పోలిస్తే మార్చి నెలలో గ్యాస్ దిగుమతులు ఏకంగా 40 శాతానికి పైగా పడిపోవడమే దీనికి ప్రధాన కారణం. యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ సరఫరా గొలుసు తెగిపోవడం వెరసి.. గృహ వినియోగదారుల నుంచి పారిశ్రామిక వర్గాల వరకు అందరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.
షిప్-ట్రాకింగ్ డేటా సంస్థ 'క్ప్లర్' నివేదిక ప్రకారం.. మార్చిలో భారత్ కేవలం 1.22 మిలియన్ టన్నుల ఎల్‌పీజీని మాత్రమే దిగుమతి చేసుకోగలిగింది. జనవరితో పోలిస్తే ఇది 46 శాతం తక్కువ. ఫిబ్రవరి చివరలో ప్రారంభమైన ఇరాన్ యుద్ధం కారణంగా హార్ముజ్ జలసంధి గుండా సముద్ర రవాణా స్తంభించిపోయింది. ఫలితంగా మనకు ప్రధాన సరఫరాదారులుగా ఉన్న యూఏఈ, ఖతార్, సౌదీ అరేబియా వంటి దేశాల నుండి రావాల్సిన షిప్‌మెంట్లు 40 శాతం మేర నిలిచిపోయాయి.
ఆదుకున్న అమెరికా.. మళ్ళీ మొదలైన ఇరాన్ సరఫరా..ఈ క్లిష్ట సమయంలో అమెరికా భారత్‌కు పెద్ద దిక్కుగా నిలిచింది. మార్చిలో అమెరికా నుండి దిగుమతులు 56 శాతం పెరిగి, దాదాపు 420,000 టన్నుల గ్యాస్ దేశానికి చేరింది. అటు ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఇరాన్ నుండి కూడా 43,000 టన్నుల ఎల్‌పీజీ దిగుమతులు పునరుద్ధరించబడ్డాయి. అయినప్పటికీ, దేశ అవసరాల్లో 60 శాతం దిగుమతులపైనే ఆధారపడి ఉండటంతో ఈ స్వల్ప ఉపశమనం సరిపోవడం లేదు.పరిశ్రమలకూ పాకిన కొరత..
దేశీయంగా ఉత్పత్తిని పెంచేందుకు చమురు మంత్రిత్వ శాఖ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంది. పెట్రోకెమికల్స్ తయారీకి వాడే హైడ్రోకార్బన్ స్ట్రీమ్‌లను ఎల్‌పీజీ ఉత్పత్తి వైపు మళ్లించాలని రిఫైనరీలను ఆదేశించింది. అయితే, దీనివల్ల ఫార్మా, రసాయన, ఆహార రంగాల్లో ముడిసరుకు కొరత ఏర్పడటంతో ప్రభుత్వం ఇప్పుడు ఆ నిర్ణయాన్ని పాక్షికంగా వెనక్కి తీసుకుంటోంది. ఫలితంగా ఇటు గృహ అవసరాలకు, అటు పరిశ్రమలకు మధ్య సమతుల్యత దెబ్బతిని గందరగోళం నెలకొంది.

## బంగారం ధరలకు గత వైభవం



పసిడి ధరలు నేడు గణనీయంగా పెరిగాయి. అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 2.80 శాతం పెరిగి 4,650.20 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. భారత్ లో 10 గ్రాముల బంగారం ధర సుమారు 1,980 రూపాయల వరకు ఎగబాకింది ప్రస్తుతం 24 క్యారెట్ల పసిడి సగటున 1,50,628 లక్షల రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. అంతర్జాతీయంగా చోటు చేసుకుంటోన్న పరిణామాలు బంగారం, వెండి ధరలను తీవ్రంగా ప్రభావితం చేస్తోన్నాయి.
అలాగే యూఎస్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలలో మార్పులు లాభాల స్వీకరణకు దారితీశాయి. అంతకుముందు వారంలో బంగారం 4,800 డాలర్లకు పైగా రికార్డు స్థాయిలను తాకిన విషయం తెలిసిందే. దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల 99.9 శాతం స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములకు 1,50,470, 22 క్యారెట్లు 91.6 శాతం స్వచ్ఛమైనది 10 గ్రాములకు 1,38,550, 18 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు 1,12,130 రూపాయల వద్ద అమ్మకాలు జరుగుతు న్నాయి.ప్రధాన నగరాలలో (గ్రాములకు) ఇలా ఉన్నాయి:

## అభిషేక్ శర్మకు యాజమాన్యం భారీ షాక్- అదే వద్దు, తగ్గించుకోకుంటే..ఇక

స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మకు ఐపీఎల్ యాజమాన్యం బిగ్ షాక్ ఇచ్చింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని నిబంధనలను అతిక్రమించినందుకు ఈ కఠిన నిర్ణయం ప్రకటించింది. అభిషేక్ తన తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇదే క్రమంలో మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించారు. కేవలం జరిమానాతోనే కాకుండా, అతని క్రమశిక్షణ రికార్డులో ఒక నెగటివ్ పాయింట్‌ను కూడా చేర్చారు. దీంతో, అభిషేక్ దిగిరాక తప్పలేదు.
సర్ రైజర్స్ కీలక ఆటగాడు అభిషేక్ కు ఊహించని షాక్ తగిలింది. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా మైదానంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించారు. కేవలం జరిమానాతోనే కాకుండా, అతని క్రమశిక్షణ రికార్డులో ఒక నెగటివ్ పాయింట్‌ను కూడా చేర్చారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని నిబంధనలను అతిక్రమించినందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కేకేఆర్ తో జరిగిన మ్యాచ్ లో అభిషేక్ శర్మ అవుట్ అయిన తీరుపై వివాదం నెలకొంది. తను ఇచ్చిన క్యాచ్ విషయంలో అంపైర్ నిర్ణ యం పట్ల అభిషేక్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. మైదానం వీడుతున్న సమయంలో అస హనంతో అభ్యంతరకరమైన భాషను ఉప యోగించినట్లు తేలింది. టీవీ రీప్లేలు, క్షేత్ర స్థాయి అంపైర్ల నివేదిక ఆధారంగా, అతను ఆర్టికల్ 2.3ని ఉల్లంఘించినట్లు నిర్ధారించారు.
అభిషేక్ శర్మ తన తప్పును అంగీకరించడంతో విచారణ లేకుండానే జరిమానాను ఖరారు చేశారు. 25 శాతం మ్యాచ్ ఫీజు కోత అనేది ఆర్థికంగా పెద్ద దెబ్బే అయినప్పటికీ, డీమెరిట్ పాయింట్ రావడం అనేది భవిష్యత్తులో సమస్యగా మారనుంది. ఒకవేళ నిర్ణీత కాల వ్యవధిలో మరిన్ని ఇలాంటి పాయింట్లు అతని ఖాతాలో చేరితే, ఒకటి లేదా రెండు మ్యాచ్‌ల పాటు నిషేధం ఎదుర్కోవాల్సి ఉంటుంది.




ఒకవైపు జట్టు భారీ విజయం సాధించి పాయింట్ల పట్టికలో ముందుకు దూసుకెళ్తున్న తరుణంలో, కీలక ఆటగాడు ఇలా వివాదంలో చిక్కుకోవడం అభిమానులను నిరాశకు గురిచేసింది. హైదరాబాద్ జట్టు తదుపరి మ్యాచ్‌లలో ఇలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతానికి అభిషేక్ శర్మ ఈ శిక్షను ఎదుర్కోక తప్పదు. అంపైర్ నిర్ణయంపై అసభ్య పదజాలంతో దూషించాడనే కారణంతో లెవల్ వన్ నేరం కింద డాషింగ్ ఓపెనర్‌పై మ్యాచ్ రిఫరీ ఈ పనిష్మెంట్ విధించారు.

## ఆ ఒక్క కారణంతోనే ముంబైని వదిలేశా.. ఇంటర్వ్యూలో టెండూల్కర్ షాకింగ్ కామెంట్..!

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో కొత్త జట్టుకు ఆడుతున్న ఆటగాళ్లలో అర్జున్ టెండూల్కర్ ఒకడు. దిగ్గజ క్రికెటర్ సచిన్ తనయుడిగా మనందరికీ సుపరిచితుడైన అర్జున్ ఈసారి తనకు మరిన్ని అవకాశాలు వస్తాయనే ఆశాభావంతో ఉన్నాడు. లక్నో సూపర్ జెయింట్స్‌కు ఆడుతున్న ఈ పొడగరి ఆల్‌రౌండర్ ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీని ఎందుకు వీడాల్సి వచ్చిందో చెప్పేశాడు. తాజాగా ఒక పాడ్‌కాస్ట్ షోలో మాట్లాడిన అర్జున్ బెంచ్ మీద ఉండడం ఇష్టం లేకనే ముంబైని వదిలేశానని చెప్పాడు.
పంతొమ్మిదో సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఆడుతున్న అర్జున్ టెండూల్కర్ ఈసారి తన ముద్ర వేయాలనుకుంటున్నాడు. తాజాగా ఒక



ఇంటర్వ్యూలో మాట్లాడిన ఈ పొడగరి ఆల్‌రౌండర్ ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీని వీడడానికి దారి తీసిన కారణాలను వెల్లడించాడు. శుభంకర్ మిశ్రా పాడ్‌కాస్ట్‌లో తన మనసులోని మాటల్ని, బాధను వెళ్లగక్కాడీ యంగ్‌స్టర్.'ముంబై ఇండియన్స్ తరఫున మీరు కొన్ని మ్యాచ్‌లు ఆడారు. మీ స్వింగ్ కూడా బాగుంది. మీకు మరిన్ని అవకాశాలు వస్తామని ఊహించి ఉంటారు కదా? అని అడిగిన ప్రశ్నకు అర్న్?న్ ఏ ఆటగాడైనా సరే అలాగే అనుకుంటారు. ఎవరూ కూడా బెంచ్ మీద కూర్చోవాలని కోరుకోరు. అయితే.. అవకాశం వచ్చినప్పుడు బాగా కష్టపడి అద్భుత ప్రదర్శన చేయాల్సి ఉంటుంది' అని అర్జున్ తెలిపాడు.ఆది నుంచి వివాదాస్పదమవుతున్న ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై కూడా అర్జున్ తన అభిప్రాయం పంచుకున్నాడు. ఆల్‌రౌండర్ అయినందున ఈ నియమాన్ని వ్యక్తిగతంగా తాను వ్యతిరేకిస్తానని అతడు అన్నాడు. 'ఏ ఫార్మాట్‌లోనైనా పదకొండు మందిని ఎంచుకొని ఆడాల్సి ఉంటుంది. కానీ, ఐపీఎల్‌లో ఇంప్యాక్ట్ ప్లేయర్ నియమం ఉంది. అంతర్జాతీయ టీ20ల్లో, ఇతర దేశాల లీగ్‌లో ఇంప్యాక్ట్ ప్లేయర్ నిబంధన లేదు. ఈ నియమంతో ఆల్‌రౌండర్లకు అవకాశాలు రావడం లేదు. కాబట్టి.. వ్యక్తిగతంగా నేను ఈ నియమాన్ని వ్యతిరేకిస్తాను' అని అర్జున్ వెల్లడించాడు. 5 మ్యాచుల్లో 3 వికెట్లుతొలి మ్యాచ్‌లో తమ జట్టు ఓటమిపై స్పందించిన అతడు .. లక్నో?? మిడిలార్డర్ పటిష్ఠంగా ఉందని, టోర్నీలో తాము పుంజుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఇప్పటివరకూ 5 ఐపీఎల్ మ్యాచుల్లో అర్జున్ 3 వికెట్లు తీశాడంతే. అతడి అత్యుత్తమ ప్రదర్శన.. 1/9.

## శాంసన్ రెండో సారీ.. బౌండరీలతో చెలరేగుతున్న మాత్రే



ఇటీవల పొట్టి ప్రపంచకప్‌లో వరసగా అర్ధ శతకాలతో అలరించిన సంజూ శాంసన్(7) ఐపీఎల్‌లో మాత్రం తడబడుతున్నాడు. తన కలల జట్టైన చెన్నై సూపర్ కింగ్స్ తరఫున దంచేయాలనుకున్న సంజూ అనూహ్యంగా చతికిలపడుతున్నాడు. వరల్డ్‌కప్‌లో పవర్ ప్లేలో ఉతికారేసిన ఈ పవర్ హిట్టర్.. కనీసం పది బతుల్ని తొలి మ్యాచ్‌లో ఆరు పరుగులకే క్లీన్ బౌల్డైన ఈ చిచ్చరపిడుగు.. రెండో మ్యాచ్‌లో 7 పరుగులకే వికెట్ ఇచ్చేశాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన ఆయుష్ మాత్రే(29 నాటౌట్) బౌండరీలతో చెలరేగుతున్నాడు.
వరసగా రెండో మ్యాచ్‌లోనూ సంజూ శాంసన్ విఫలమయ్యాడు. ఇన్నింగ్స్ రెండో ఓవర్లో బార్ట్‌లెట్ సంధించిన బంతి ఎడ్జ్ తీసుకొని వికెట్ కీపర్ ప్రభ్‌సిమ్రన్ చేతుల్లో పడింది. అంతే.. మంచి ఇన్నింగ్స్‌తో అభిమానులకు పూనకాలు తెప్పించాలనుకున్న శాంసన్ కల చెదిరింది. వికెట్ పడినా ఆయుష్ మాత్రే(29 నాటౌట్) బౌండరీలతో అలరిస్తున్నాడు.
బార్ట్‌లెట్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు బాదిన మాత్రే.. అనంతరం విజయ్‌కుమార్ బౌలింగ్‌లో సూపర్ సిక్సర్ బాదాడు. పవర్ ప్లే చివరి ఓవర్లో మాత్రే ఫోర్ రాబట్టగా సీఎస్కే.. 6 ఓవర్లలో వికెట్ నష్టానికి 57
పరుగుల చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 14 రన్స్‌తో క్రీజులో
ఉన్నాడు.

## టాస్ గెలిచిన పంజాబ్.. చెన్నై తుది జట్టులో అన్‌క్యాప్డ్ ప్లేయర్



పంతొమ్మిదో సీజన్‌ను ఓటమితో ఆరంభించిన చెన్నై సూపర్ కింగ్స్(జూఖ) ధోనీ లేకుండానే రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. తమ సొంత మైదానమైన చెపాక్‌లో పంజాబ్ కింగ్స్ సీఎస్కేఢీ కొడుతోంది. స్పిన్‌కు అనుకూలించే పిచ్ మీద పంజాబ్ ఆటగాళ్లకు చుక్కలు చూపించాలని రుతురాజ్ గైక్వాడ్ సేన భావిస్తోంది. టాస్ గెలిచిన పంజాబ్ సారథి శ్రేయాస్ అయ్యర్ బౌలింగ్ తీసుకున్నాడు.తొలి పోరులో అదిరే విజయంతో జోరు మీదున్న పంజాబ్ చెపాక్‌లోనూ చెలరేగాలని అనుకుంటోంది. కుర్రాళ్లతో అద్భుతం చేయాలని భంగపడిన చెన్నై సొంత గడ్డపై పంజ విసరాలనే కసితో ఉంది. మొత్తంగా.. రికార్డులు చూస్తే రెండు జట్లు టోర్నీలో సమాన (16-16) విజయాలు సాధించాయి.కానీ, కొన్ని సీజన్లుగా సీఎస్కేపై పంజాబ్ 6-1తో ఆధిపత్యం చెలాయించింది. పంజాబ్ ఏ మార్పులు ఏకుండా ఆడుతుండగా.. మ్యాట్ షార్ట్ స్థానంలో చెన్నై జట్టులోకి ప్రశాంత్ వీర్ వచ్చాడు. రూ.30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన ఈ యువ ఆల్‌రౌండర్‌ను చెన్నై రూ.14.20 కోట్లకు కొన్నది.చెన్నై సూపర్ కింగ్స్ తుది జట్టు : సంజూ శాంసన్(వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్(కెప్టెన్), ఆయుష్ మాత్రే,

## నేను ఐపీఎల్ ఆడడం వాళ్లకు నచ్చట్లేదు.. అసూయతోనే 'స్ట్రయిక్ రేటు'పై విమర్శలు

పంతొమ్మిదో సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ వరుసగా రెండు మ్యాచుల్లో ఓడడంతో కెప్టెన్ అంజిక్యా రహానే (ూాయిఱఅఎఝ ఝష్ఱుఅవ)పై విమర్శలు వెల్లువెత్తున్నాయి. రహానే దూకుడుగా ఆడలేకపోవడం కోల్‌కతా విజయావకాశాల్ని దెబ్బతీస్తుందని కామెంటేటర్లు, మాజీ ఆటగాళ్లు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో తన స్ట్రయిక్ రేటుపై వస్తున్న కామెంట్లపై రహానే కరుకుగా స్పందించాడు. కొందరికి తనంటే అసూయ అని, ఉద్దేశపూర్వకంగానే తనపై విమర్శలు చేస్తున్నారని కౌంటర్ ఇచ్చాడు కేకేఆర్ సారథి.
ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఇంకా బోణీ కొట్టలేదు. తొలి మ్యాచ్‌లో పంజాగ్ కింగ్స్ చేతిలో.. రెండో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ పంజాకు కోల్‌కతా కుదేలైంది. మూడుసార్లు ఛాంపియన్ అయిన



కేకేఆర్ వరుస ఓటములకు కెప్టెన్ అజింక్యా రహానే స్ట్రయిక్ రేటు ఓ కారణమని విమర్శలు వస్తున్నాయి. దాంతో.. తనపై అనవసరంగా కొందరు తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని వాపోతున్నాడు రహానే.'నా స్ట్రయిక్‌రేటుపై కొందరు విమర్శలు చేస్తున్నారు. కానీ, ఇప్పటివరకూ నేను గొప్పగా ఆడుతున్నా. 2023 సీజన్ నుంచి స్ట్రయిక్ రేటు ఎంతో మెరుగైంది. నా గురించి చెత్త మాట్లాడేవాళ్లు నా ఆట చూడడం లేదు కావచ్చు లేదా ఉద్దేశపూర్వకంగా నన్ను లక్ష్యంగా చేసుకుని ఉండవచ్చు. అలాంటి వాళ్లకు నేను ఆడడం నచ్చదు. నా ఆట చూడడం వాళ్లకు ఇష్టముండదు. నేను సాధించిన విజయాలు చూసి వాళు అసూయ పడుతున్నారు. వాళ్ల మాటలకు నేను ఆందోళన చెందడం లేదు.

# ప్రభాస్ 'బిల్లా' కు 17 ఏండ్లు.. మెహర్ రమేష్ ఎమోషనల్ పోస్ట్



రెబల్ స్టార్ ప్రభాస్ కెరీర్‌లో అత్యంత స్టైలిష్ మూవీగా నిలిచిన 'బిల్లా' విడుదలై నేటికి సరిగ్గా 17 ఏళ్లు పూర్తయింది. 2009 ఏప్రిల్ 3న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, టాలీవుడ్‌లో స్టైలిష్ యాక్షన్ చిత్రాలకు సరికొత్త బెంచ్ మార్క్‌గా నిలిచింది. ఈ సందర్భంగా దర్శకుడు మెహర్ రమేష్ సోషల్ మీడియా వేదికగా సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంటూ చిత్ర బృందానికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ ప్రత్యేకమైన రోజున దర్శకుడు మెహర్ రమేష్ ఆ వేదికగా స్పందిస్తూ సినిమా షూటింగ్ విశేషాలను నెమరువేసుకున్నాడు. బిల్లా సినిమా స్టైల్ అండ్ స్వాగ్‌కు సరికొత్త నిర్వచనమని, మణిశర్మ అందించిన సంగీతం ఒక మ్యాజిక్ అని ఆయన పేర్కొన్నారు. తన విజన్‌కు తగ్గట్టుగా మేకింగ్ ఉందని, తమ చిత్ర బృందం అత్యంత వేగంగా కేవలం 4 నెలల్లోనే ఈ భారీ చిత్రాన్ని రూపొందించిందని వెల్లడించారు. ఈ సినిమా షూటింగ్ నవంబర్ 12, 2008న ప్రారంభం కాగా, ఏప్రిల్ 3, 2009న విడుదలైంది. ఆయన తన పోస్ట్‌లో ప్రభాస్‌ను "మన హృదయాల డాన్" అని అభివర్ణిం చాడు. మెహర్ రమేష్ తన పోస్ట్‌లో ఈ చిత్రంలో భాగమైన నటీనటులైన రెబల్ స్టార్ కృష్ణంరాజు, అనుష్క శెట్టి, నమిత, హన్సిక, సుబ్బరాజులతో పాటు నిర్మాతలు నరేంద్ర, ప్రభోద్‌లను కూడా ట్యాగ్ చేస్తూ గుర్తుచేసుకున్నాడు. అలాగే సాంకేతిక నిపుణులైన మణిశర్మ, సినిమా టోగ్రాఫర్ సౌందర్ రాజన్, ఎడిటర్ మార్తాండ్ కె. వెంకటేష్, ఫైట్ మాస్టర్ స్టన్ శివ, ఆర్ట్ డైరెక్టర్ ప్రకాష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రం విడుదలై 17 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభాస్ అభిమానులు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు.

# ఎట్టకేలకి తన భర్తని పరిచయం చేసిన ట్రాన్స్‌జెండర్ తమన్నా సింహాద్రి ..




తెలుగు బిగ్‌బాస్ సీజన్–3 కంటెస్టెంట్‌గా గుర్తింపు తెచ్చుకున్న తమన్నా సింహాద్రి తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ముఖ్యమైన విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఏడాది క్రితమే తనకు వివాహం జరిగిందని వెల్లడిస్తూ, మొదటి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భర్తతో కలిసి ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ పోస్టులు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. విజయవాడకు చెందిన తమన్నా అసలు పేరు మస్తాన్. చిన్ననాటి నుంచి ఎదుర్కొన్న సవాళ్లను అధిగమిస్తూ, తన అసలైన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించుకునే ప్రయాణంలో భాగంగా ముంబైలో లింగ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆ తర్వాత తమన్నా సింహాద్రిగా కొత్త జీవితం ప్రారంభించారు. ఆమె జీవన ప్రయాణం ఎంతో మందికి ప్రేరణగా నిలిచింది. బిగ్‌బాస్ హౌస్‌లో ఉన్న సమయంలో శ్రీముఖితో ఏర్పడిన స్నేహం ఇప్పటికీ కొనసాగుతోందని తమన్నా వెల్లడించారు. కుటుంబ సభ్యులు దూరంగా ఉన్న సమయంలో శ్రీముఖి తనకు అండగా నిలిచిందని, కుటుంబ సభ్యురాలిలా ఆదరించిందని ఆమె భావోద్వేగంగా పేర్కొన్నారు. ఇక రాజకీయాలపైనా తమన్నాకు ఆసక్తి ఉంది. గతంలో మంగళగిరిలో నారా లోకేష్‌పై, పిఠాపురంలో పవన్ కళ్యాణ్‌పై పోటీ చేసి వార్తల్లో నిలిచారు. తనదైన స్టైల్లో ఎప్పుడూ సంచలనంగా నిలిచే తమన్నా, ఇప్పుడు తన వ్యక్తిగత జీవితం ద్వారా మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు. అయితే తన భర్త పేరు, ఇతర వ్యక్తిగత వివరాలను మాత్రం ఆమె గోప్యంగా ఉంచారు. సొంత ఊరిలో కుటుంబ సభ్యులతో కలిసి ఈ ప్రత్యేక రోజును జరుపుకున్న ఫోటోలు అభి మానులను ఆకట్టుకుంటున్నాయి. తల్లి కోరిక మేరకు అమ్మాయిగా మారి, జీవితాన్ని కొత్తగా ప్రారంభించిన తమన్నా తెలుపుతున్నారు.

# ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ సినిమాలో 'ధురంధర్' నటుడు



బాలీవుడ్ సెన్సేషనల్ మూవీ 'ధురంధర్' చిత్రంలో బలోచ్ యునైటెడ్ ఫోర్స్ లీడర్ శ్రీరాని బలోచ్ పాత్రలో అద్భుతమైన నటనను కనబరిచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు బిమల్ ఒబెరాయ్‌కు టాలీవుడ్‌లో బంపర్ ఆఫర్ లభించింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ మరియు స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ (వర్కింగ్ టైటిల్: డ్రాగన్) లో ఆయన ఓ కీలక పాత్ర పోషించబోతున్నట్లు తెలుస్తుంది. ప్రశాంత్ నీల్ మార్క్ పవర్‌ఫుల్ యాక్షన్ చిత్రంలో తనకు ప్రాముఖ్యత ఉన్న రోల్ దక్కినట్లు నటుడు బిమల్ ఒబెరాయ్ స్వయంగా వెల్లడించారు. తాను ఎన్టీఆర్ సినిమాలో నటిస్తున్నట్లు ఆయన ధృవీకరించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా, రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తోంది. బాలీవుడ్‌లో 'ధురంధర్' లాంటి భారీ బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత ఈ నటుడు తెలుగులో ఎంట్రీ ఇస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకులలో అంచనాలు మరింత పెరిగాయి.

# 'క' చిత్ర దర్శకులతో సాయి దుర్గ తేజ్ పాన్-ఇండియా అడ్వెంచర్




టాలీవుడ్ సుప్రీం హీరో, మెగా మేనల్లుడు సాయి దుర్గ తేజ్ తన కెరీర్‌లో 19వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించాడు. చూఉ19 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది. ఈ పోస్టర్ చూస్తుంటే సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. యుగాల నాటి రహస్యాలు, ఊహకు అందని అద్భుత శక్తుల చుట్టూ తిరిగే కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. ఇటీవల కిరణ్ అబ్బవరం హీరోగా వచ్చిన 'క' చిత్రంతో టాలీవుడ్‌లో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకొని అందరి దృష్టిని ఆకర్షించిన యువ దర్శకులు సుజీత్ మరియు సందీప్ ఈ భారీ ప్రాజెక్ట్‌ను సంయుక్తంగా దర్శకత్వం వహించబోతున్నారు. వారి గత చిత్రంలాగే ఈ సినిమా కూడా సరికొత్త స్క్రీన్‌ప్లే, అద్భుతమైన విజువల్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేస్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ పతాకంపై నిర్మాత సాహు గారపాటి అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ఈ సినిమాతో సాయి దుర్గ తేజ్ తన తల్లి పేరిట 'విజయదుర్గ ప్రొడక్షన్స్' అనే సొంత బ్యానర్‌ను స్థాపించి తొలిసారిగా నిర్మాణ భాగస్వామిగా మారుతుండటం విశేషం. ఇక విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను చూస్తుంటే.. ఒక దట్టమైన అడవి ప్రాంతంలో సాయి దుర్గ తేజ్ ఒక శక్తివంతమైన యోధుడిలా నిలబడి ఆకాశం వైపు తీక్షణంగా చూస్తున్నట్లు ఇందులో చూపించారు. ఆకాశంలో వింతైన మేఘాలు, ఒక రహస్యమైన పర్వతం, దాని చుట్టూ అంతుచిక్కని అద్భుత కాంతి పుంజాలు కనిపిస్తున్నాయి. దీనికి తోడు 'యుగాల నాటి రహస్యాలు..స్పష్టమవుతోంది.

# బండ్ల గణేష్ ఇంట పెళ్లి వేడుకలు ప్రారంభం.. ఘనంగా పసుపు కుంకుమ వేడుక




తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రముఖ నిర్మాతగా గుర్తింపు పొందిన బండ్ల గణేష్ ఇంట ప్రస్తుతం పెళ్లి సందడి నెలకొంది. తనదైన వాక్చాతుర్యంతో, అలాగే పవన్ కళ్యాణ్‌పై ఉన్న అభిమానంతో ఎప్పుడూ వార్తల్లో నిలిచే ఆయన, ఇప్పుడు తన కుమార్తె వివాహ వేడుకలతో హాట్ టాపిక్‌గా మారారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. బండ్ల గణేష్ కుమార్తె జనని బండ్ల వివాహ వేడుకలకు శ్రీకారం చుట్టారు. తొలి కార్యక్రమంగా ఇంట్లో 'పసుపు కుంకుమ' వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు.

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు.. దేవుడి ఆశీస్సులు, పెద్దల దీవెనలతో త్వరలో మా ఇంట్లో జరగబోయే శుభకార్యం. చిరంజీవి సూర్యతేజ చిలుకూరి, లక్ష్మీ సౌభాగ్యవతి జనని బండ్లల వివాహ సందర్భంగా పసుపు కుంకుమ కార్యక్రమం నిర్వహించాం అని బండ్ల గణేష్ తన పోస్టులో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి దిగిన ఫోటోల్లో ఆయన ఆనందం స్పష్టంగా కనిపిస్తోంది.ఈ విషయం తెలిసిన సినీ ప్రముఖులు, అభిమానులు ఆయన కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సోషల్ మీడియాలో జనని వివాహంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

# ఇదెక్కడి స్పీడయ్యా.. బాలయ్యా.. కొంచెం గ్యాప్ ఇవ్వయ్యా..

నటసింహం నందమూరి బాలకృష్ణ తన కెరీర్‌లో అఖండమైన వేగంతో దూసుకు పోతున్నారు. 60 ఏళ్ల వయసులో కూడా కుర్ర హీరోలకు పోటీనిస్తూ బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్టులను లైన్‌లో పెడుతున్నారు. అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి, ఢాకూ మహారాజ్, అఖండ2 వంటి విజయాల తర్వాత ఆయన ఎనర్జీ లెవెల్స్ అమాంతం పెరిగాయి. కేవలం ఒక సినిమా సెట్స్ మీద ఉండగానే, మరో మూడు చిత్రాల కథలను వింటూ ఖరారు చేసేశారు. ఒకరకంగా బుల్లెట్ ట్రైన్ కన్నా వేగంగా దూసుకుపోతూ కుర్ర హీరోలకు సవాల్ విసురుతున్నారు.విజయదశమి లేదా సంక్రాంతిదర్శకుడు గోపీచంద్ మలినేనితో మాఫియా బ్యాక్ డ్రాప్ లో తన 111వ చిత్రం చేస్తున్నారు. ముంబై అండర్ వరల్డ్ నేపథ్యంలో సాగే ఈ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాలో బాలయ్య గ్యాంగ్‌స్టర్‌గా కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన కొన్ని గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. ఈ చిత్రాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి 2026 దసరా లేదా దీపావళి కానుకగా విడుదల చేయాలని బాలయ్య లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒకవేళ ఏవైనా కారణాల వల్ల ఆలస్యమైతే, 2027 సంక్రాంతికి



విడుదల చేస్తారు.కథ పెద్ది కావడంతో రెండు భాగాలు

బాలయ్య తన సాధారణ శైలికి భిన్నంగా వివేక్ ఆత్రేయ వంటి యంగ్ అండ్ ఇంటెలిజెంట్ డైరెక్టర్‌కు అవకాశం ఇవ్వడం తెలుగు ఫిలింనగర్ లో పెద్ద చర్చకు దారితీసింది. ఈ చిత్రానికి 'కురుక్షేత్రం' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. దాదాపుగా ఇదే ఖాయమయ్యే అవకాశం ఉంది. కథ చాలా పెద్దదిగా ఉండటంతో రెండు భాగాలుగా తెరకెక్కించబోతున్నారు. ఈ రెండు భాగాల షూటింగ్‌ను కూడా దాదాపు ఏకకాలంలో పూర్తి చేయాలని దర్శకుడికి బాలకృష్ణ సూచించారు.

కెరీర్ లోనే అత్యంత వేగంగా ఉన్నారు' నాంది', 'ఉగ్రం' చిత్రాల దర్శకుడు విజయ్ కనకమేడల కూడా బాలయ్య రేసులోకి వచ్చారు. విజయ్ చెప్పిన ఒక శక్తిమ ంతమైన పోలీస్ బ్యాక్‌డ్రాప్ కథకు బాలయ్యకు బాగా నచ్చి వెంటనే ఓకే చెప్పేశారు. దీన్ని ఛ తక్కువ బడ్జెట్, తక్కువ సమయంలో పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నారు. గోపీచంద్ సినిమా తర్వాత వివేక్ ఆత్రేయ లేదా విజయ్ కనకమేడల సినిమాల్లో ఏది ముందు పట్టాలెక్కుతుందనేది తెలియాలంటే కొద్దిరోజులు వేచిచూడాల్సిందే. కొత్త దర్శక ులతో ప్రయోగాలు చేయడం, భారీ బడ్జెట్ సినిమాలతో పాటు వేగంగా పూర్తయ్యే సిని మాలను బ్యాలెన్స్ చేయడం చూస్తుంటే.. బాలయ్య తన కెరీర్‌లో అత్యంత సూపర్ ఫాస్ట్ దశలో ఉన్నారని,
బుల్లెట్ ట్రైన్ లా
దూసుకుపోతున్నారని చెప్పొచ్చు.

# ఆది సాయికుమార్ 'సైరాబాను' గ్రాండ్ లాంచ్.. క్లాప్ కొట్టిన కిరణ్ అబ్బవరం

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ఆది సాయికుమార్ సరికొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. అన్ని హద్దులను చెరిపేసే ఒక అందమైన ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'సైరాబ ాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రాజెక్ట్ నేడు అత్యంత వైభవంగా పూజా కార్యక్రవ ాలతో ప్రారంభమైంది. సినీ రంగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ముహూర్తపు సన్నివేశానికి యంగ్ హీరో కిరణ్ అబ్బవరం క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు రామ్ అబ్బరాజు మరియు సీనియర్ నటుడు సాయికుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ మరియు జైన్స్ నాని చిత్ర



స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ఇక ఈ మొదటి షాట్‌కు దర్శకుడు యోగి దర్శకత్వం వహించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫణి క్రిష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాంధవి శ్రీధర్ కథానాయికగా నటిస్తోంది. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమా టోగ్రాఫర్‌గా మరియు ఛోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

# రాజమౌళి దర్శకత్వంలో మిస్ అయిన చిరంజీవి-నాగార్జున మల్టీస్టారర్



వరుసగా 12 బ్లాక్ బస్టర్లతో అపజయమే ఎరుగని దర్శక ధీరుడిగా, భారతదేశంలో నెం.1 దర్శకుడిగా రాణిస్తున్న ఎస్.ఎస్. రాజమౌళి ఇప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు కథానాయకుడిగా వారణాసి చిత్రం చేస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ ఏడోతేదీన ఈ సినిమా విడుదల కాబోతోంది. మొత్తం 120 దేశాల్లో విడుదల చేస్తున్నారు. ఈ సినిమాతో మహేష బాబు పాన్ వరల్డ్ హీరో అయిపోయినట్లేనని ప్రిన్స్ అభిమానులు సంబరంగా ఉన్నారు. రాజమౌళి వేసే ప్రతి అడుగు అత్యంత జాగ్రత్తగా, వ్యూహాత్మకంగా ఉంటుంది. మహేష్ బాబుతో తీస్తున్న సినిమా కేవలం ఒక యాక్షన్ అడ్వెంచర్ మాత్రమే కాదు, అది అంతర్జాతీయస్థాయిలో ఉన్న సినీ ప్రియుల ందరినీ అరించేలా రూపుది ద్దకుంటోంది. సింహాద్రి తీసిన తర్వాత అడిగాడురాజమౌళి కెరీర్ తొలిరోజుల్లో అంటే సింహాద్రి సినిమా తీసిన తర్వాత ఒక భారీ మల్టీస్టారర్‌కు ప్లాన్ చేశారు. మెగాస్టార్ చిరంజీవి, కింగ్ నాగార్జునలను ఒకే స్క్రీన్‌పై చూపించేలా రచయిత విజయేంద్రప్రసాద్ ఒక అద్భుతమైన కథను సిద్ధం చేశారు. ఆ సమయంలోనే ఈ కాంబినేషన్ సెట్స్ మీదకు వెళ్లాల్సి ఉంది. అయితే అదే సమయానికి బిజీగా ఉన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.